జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ అధికారుల తనిఖీ

జమ్మికుంట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిన్నింగ్ మిల్లుల్లో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) వరంగల్ రీజినల్ మేనేజర్ ఉమాంగ్ గురువారం తనిఖీ నిర్వహించారు. జమ్మికుంట కాటన్ పర్చేస్ ఆఫీసర్ చంద్రశేఖర్‌తో కలిసి పలు జిన్నింగ్ మిల్లుకు వెళ్లారు. సీసీఐ కొనుగోలు చేసిన పత్తి, బేళ్లలో తేమ శాతం, కొనుగోళ్లకు సంబంధించిన రికార్డులు, షీట్లు పరిశీలించారు. సిద్ధంగా ఉన్న బేళ్ల, వాటి వివరాలు నమోదు చేసుకున్నారు. సీసీఐ కొనుగోలు చేసిన పత్తిలో తేమశాతం ఎక్కువ రావడం ఏమిటని కాటన్ పర్చేస్ ఆఫీసర్‌ను ప్రశ్నించారు. సీసీఐ కొనుగోలు చేసిన పత్తిని ఎప్పటికి అప్పుడుపరిశీలిస్తున్నామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉంటే సీపీవోపై చర్యలు తప్పవన్నారు. 8 నుంచి 12శాతం లోపు తేమ ఉన్న పత్తిని మాత్రమే కొనాలని సూచించారు.

రేపు జాబ్‌మేళా

కరీంనగర్ టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ చదివిన వారికి ఈనెల 6న కరీంనగర్‌లో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ సంస్థ నిర్వహిస్తున్న టెక్‌బీ ప్రోగ్రామ్ కోసం 2024, 2025లో ఇంటర్ పూర్తిచేసిన విద్యార్థులకు జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఎదుట ఉన్న స్పేస్ కంప్యూటర్ ఎడ్యుకేషన్‌లో ఉదయం 10 గంటలకు ఈ మెగా జాబ్‌మేళాను నిర్వహిస్తున్నామన్నారు. ఎంపీసీ, ఎంఈసీ (ఓవరాల్ 75 శాతం, మాథమెటిక్స్ 60 శాతం), సీఈసీ, వొకేషనల్ కంప్యూటర్స్ (ఓవరాల్ 75 శాతం) చదివిన విద్యార్థులు అర్హులన్నారు. ఔత్సాహిక అభ్యర్థులు పదో తరగతి, ఇంటర్ సర్టిఫికెట్లు, ఆధారుకార్డ్ జిరాక్స్, ఒక ఫొటో, ఆండ్రాయిడ్ మొబైల్‌తో మేళాకు హాజరుకావాలని సూచించారు. వివరాలకు హెచ్‌సీఎల్ ప్రతినిధిని 6303207394, 7981834205 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.



ఇళ్ల అనుమతులు గగనమే..

- కొర్రీలు పెడుతూ పర్మిషన్ల నిరాకరణ
- నగరపాలక సంస్థలో పేరుకు పోతున్న ఫైళ్లు ...
- యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు

కరీంనగర్ టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో ఇళ్లు కట్టుకోవడానికి నగరపాలక సంస్థను అనుమతులు పొందడం గగనమవుతోంది. గత ప్రభుత్వం అనుమతుల మంజూరుకు టీఎస్ బీపాస్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ విధానంలో ఆన్‌లైన్‌లో ఇంటి నిర్మాణానికి దరఖాస్తు చేసుకుంటే 21 రోజుల్లో డాక్యుమెంట్లను పరిశీలించి ఇంటి అనుమతులు ఇవ్వాలి. 21 రోజుల్లో అనుమతి ఇవ్వకుంటే ఇళ్లను నిర్మించుకోవచ్చని నిబంధనలు విధించింది.

ప్రభుత్వం పారదర్శక సేవల కోసం ఎన్ని సంస్కరణలు తీసుకు వచ్చినా క్షేత్రస్థాయిలో ఆశించిన ఫలితాలు రావడం లేదు. కొత్తగా ఇళ్లు నిర్మించుకునే వారు ఆన్‌లైన్‌లో నేరుగా కానీ మున్సిపల్ రిజిస్టర్డు ఇంజనీర్ల ద్వారా ఇంటి కోసం దరఖాస్తు చేసుకొని అన్ని డాక్యుమెంట్లను జతచేసినా 21 రోజుల్లో అనుమతులు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టౌన్ ప్లానింగ్ అధికారుల చుట్టూ తిరుగుతున్నా అనుమతులు ఇవ్వడం లేదని విమర్శిస్తున్నారు. ప్లాన్ సరిగా లేదని, ఏదో ఒక సాకును కొరివి పెడుతూ ముప్పుతిప్పలు పెడుతున్నారని, డబ్బులు ఇవ్వనిదే కనీసం ఫైల్ ముందుకు కూడా కదలడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

నిబంధనలను పట్టించుకోని అధికారులు

మున్సిపల్ ఇంజనీర్లు ఆన్‌లైన్‌లో నిబంధనల మేరకు ఫీజులను, ఇతర డాక్యుమెంట్లను జతచేసి దరఖాస్తు చేసుకున్నా ఇంటి అనుమతులు ఇవ్వడ లేదు. వాటిని పరిశీలించి స్థల పరిశీలన చేయకుండా పక్కనబెడుతున్నారని, కొన్ని ఫైళ్లను బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు, మరికొన్ని ఫైళ్లను టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్లు వారి వద్దనే పెండింగ్‌లో పెడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. లంచం ముడితేనే ఫైల్ ముందుకు కదులుతుందనే ఆరోపణలు వస్తున్నాయి. మరోవైపు నగరపాలక సంస్థ పరిధిలో విలీన గ్రామాల్లో ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. ఇటువంటి నిర్మాణాలను ఆపాల్సిన టౌన్‌ప్లానింగ్ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

టౌన్‌ప్లానింగ్ అంటేనే అవినీతికి కేరాఫ్‌గా మారిందని పలువురు బాహటంగానే విమర్శిస్తున్నారు. కమిషనర్, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా అనుమతులు రావడం లేదని, అక్రమ కట్టడాలపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని నగర వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగరపాలక సంస్థలో అత్యంత కీలకమైన టౌన్‌ప్లానింగ్ విభాగంపై ఉన్నతాధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపించాలని కోరుతున్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

- కలెక్టర్ పమేలా సత్పతి
- గట్టుబూత్కూర్‌లో వలస కార్మికుల పిల్లలకు ప్రత్యేక తరగతి గది ప్రారంభం

గంగాధర, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే పిల్లలకు ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందని కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. గంగాధర మండలం గట్టుబూత్కూర్‌లో వలస కార్మికుల పిల్లలకు ప్రభుత్వ పాఠశాలలో ప్రత్యేక తరగతి గదిని ఏర్పాటు చేశారు. ఆ గదిని కలెక్టర్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో అన్ని గ్రామాల్లో వలస కార్మికుల పిల్లలను గుర్తించి సమీపంలోని పాఠశాలలో ప్రత్యేక తరగతుల ద్వారా బోధన చేయిస్తున్నామని తెలిపారు. త్వరలోనే మరిన్ని పాఠశాలల్లో ప్రత్యేక తరగతులను ప్రారంభిస్తామన్నారు. పిల్లలు పాఠశాలలకు వెళ్లేందుకు రవాణా సౌకర్యం కల్పించాలని ఇటుక బట్టీల యాజమానులకు సూచించారు. పిల్లలకు యూనిఫాం, పుస్తకాలు, నోటు బుక్కులు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం పూర్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ రజిత, ఎంఈవో ప్రభాకర్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విద్యార్థిని అభినందిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

యాసంగి సాగుకు సన్నద్ధం

పంట ప్రణాళిక సిద్ధం చేసిన అధికారులు

కరీంనగర్ రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైతులు యాసంగి పనులకు సిద్ధమవుతున్నారు. ఇప్పటి నుంచే నారు మడులు తయారు చేసుకుంటున్నారు. ఈసారి భారీ వర్షాలు కురవడంతో చెరువులు, కుంటలు నిండు కుండలా మారాయి. వ్యవసాయ బావుల్లో నీటి మట్టం పెరిగింది. బోరు బావులపై ఆధారపడ్డ రైతులు ఇప్పటికే వరి నారుమళ్లు దున్నుతు, పొలాలను చదును చేసే పనుల్లో పడ్డారు. కరీంనగర్ రూరల్ మండలంలో 2025-26 యాసంగి పంటల సాగు ప్రణాళికను వ్యవసాయశాఖ తయారు చేసింది. పంటల సాగువిస్తీర్ణం అవసరమైన ఎరువుల ప్రణాళికను అధికారులు రూపొందించారు. మండలంలో మొత్తం 16,192 ఎకరాల సాగు భూమి ఉండగా వరి 12,623 ఎకరాల్లో, మొక్కజొన్న 854 ఎకరాల్లో, పప్పు ధాన్యాలు 50 ఎకరాల్లో, ఇతర పంటలు 85 ఎకరాల్లో సాగు చేస్తారని అంచనా వేశారు. ప్రధానంగా వరి పంటను ఎక్కువ విస్తీర్ణంలో రైతులు సాగు చేసే అవకాశం ఉంది. యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు మండల వ్యవసాయ అధికారి బి సత్యం తెలిపారు. డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉంచేలా ఏర్పాట్లు చేస్తున్నారు.


దుక్కులు దున్నుతున్న రైతు

విలేజ్ మేనిఫెస్టో

- సర్పంచ్ అభ్యర్థుల హామీలు
- ప్రచారంలో ఎత్తుకు పై ఎత్తులు

చొప్పదండి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ పోరులో అభ్యర్థులు ఎత్తుకు పై ఎత్తు వేస్తున్నారు. ఒకరిని మించి మరొకరు హామీలను గుప్పిస్తున్నారు. తమదైన శైలిలో మేనిఫెస్టోలను ప్రకటిస్తున్నారు. గెలిస్తే ఐదేళ్లలో తాము చేయబోయే అభివృద్ధి కార్యక్రమాలను మేనిఫెస్టోలో ప్రకటించి ఓటర్ల ముందుకు వెళ్తున్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా జాతీయ, ప్రాంతీయ పార్టీల మేనిఫెస్టోలకు ధీటుగా గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థులు మేని ఫెస్టోలను ప్రకటించి ప్రజల ముందు ఉంచుతున్నారు. గతంలో గెలిచిన ప్రజాప్రతినిధులు చేసిన అభివృద్ధి, చేయాలన్న అభివృద్ధి పేరిట కర పత్రాల ద్వారా ప్రచారాన్ని నిర్వహించడం విశేషం. గత పంచాయతీ ఎన్నికలకు భిన్నంగా ఈసారి సోషల్ మీడియా వేదికగా ప్రచారం తీవ్రం చేశారు. అభ్యర్థులు తమ పార్టీల పేర్లు, జెండా, ఏజెండాలు లేకుండా ప్రజలకు హామీల వర్షం కురిపిస్తున్నారు.



గ్రామాల్లో హోరాహోరీ...

చొప్పదండి మండలంలో 16 గ్రామ పంచా యతీలు ఉండగా రెండు గ్రామ సర్పంచ్ పదవులు ఏకగ్రీవమయ్యాయి. మిగతా 14 గ్రామాల్లో సర్పంచ్ కోసం హోరాహోరీగా పోరు కొనసాగు తుంది. ఆర్నకొండ గ్రామం ఎస్సీ మహిళకు రిజర్వ్ కాగా ఇక్కడ అత్యధికంగా 12 మంది సర్పంచ్ పదవికి పోటీ పడుతున్నారు. పోరు హోరాహోరీగా సాగుతుండగా ఎత్తుకు పై ఎత్తులు వేస్తూ హామీల వర్షం కురిపిస్తున్నారు. చిన్న గ్రామాలైన రెవెల్లిలో ఆరుగురు, సాంబ య్యపల్లిలో ఏడుగురు అభ్యర్థులు పోటీలో ఉన్నారు. మొత్తం మండలంలోని 14 గ్రామాల్లో 68 మంది సర్పంచ్‌లకు, 101 వార్డులకు 240 మంది పోటీ పడుతున్నారు.

సోషల్ మీడియాలో ప్రచారం...

పంచాయతీలో సర్పంచ్, వార్డు సభ్యులకు ఈసారి అధికశాతం యువత పోటీ పడుతుండగా ప్రచార పర్వమంతా సోషల్ మీడియా ద్వారా సాగుతుంది. వాట్సప్ విలేజ్ గ్రూపుల్లో హామీలను పోస్టు చేస్తున్నారు. ఇతర సోషల్ మీడియా గ్రూపుల్లో తమ ప్రచారాన్ని అభ్యర్థులు కొనసాగిస్తున్నారు. వీడియోలు, ఆడియోలను సోషల్ మీడియాలో పోస్టు చేసి ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు.

నిబంధనల ప్రకారం పంచాయతీ ఎన్నికలు

రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణికుముదిని

కరీంనగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో పంచాయతీ ఎన్నికలను నిబంధనల ప్రకారం నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని అధికారులను ఆదేశించారు. ఆమె గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణపై జిల్లా ఎన్నికల అధికారులు, కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వార్డు సభ్యులంతా ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రామాల్లో ఉప సర్పంచ్ ఎన్నిక నిబంధనల మేరకు జరిగేలా చూడాలని అన్నారు. ఏకగ్రీవంగా ఎంపికైన గ్రామ సర్పంచ్ పదవులకు ఫారం 10 ప్రకారం ఫలితాలు ప్రకటించాలని చెప్పారు. నామినేషన్ల ప్రక్రియ ముగిసిన వెంటనే సంబంధిత గ్రామాల్లో స్టేజ్-2 రిటర్నింగ్ అధికారుల నియామకం పూర్తి చేయాలన్నారు. నామినేషన్ల ప్రక్రియ చివరి దశకు చేరుకున్నందున సంబంధిత రిపోర్టులు టి పోల్‌లో పెండింగ్ లేకుండా నమోదు చేయాలని సూచించారు.

ప్రతి గ్రామపంచాయతీకి సంబంధించి వచ్చిన నామినేషన్లలో వ్యాలిడ్ నామినేషన్ల వివరాలు అప్‌డేట్ చేయాలని అన్నారు. ప్రతి మండలంలో పోస్టల్ బ్యాలెట్ ఫెలిసిటేషన్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బ్యాలెట్ పేపర్ నిబంధనల ప్రకారం ముద్రించాలన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో కోడ్ ఉల్లంఘన జరుగకుండా నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. లా అండ్ ఆర్డర్ అదనపు డీజీపీ మహేశ్‌భగవత్ మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల సందర్భంగా నిర్వహించే తనిఖీల్లో అక్రమంగా నగదు, మద్యం, ఆభరణాలను ఓటర్లను ప్రలోభపెట్టేందుకు తరలించే పక్షంలో నిబంధనల మేరకు సీజ్ చేయాలన్నారు.

పోలింగ్ రోజు సరిహద్దు ప్రాంతాల్లో అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు సీజన్ నడుస్తున్నందున రైతుల వద్ద ఉన్న ఆధారాలు పరిశీలించి, పంట డబ్బులను సీజ్ చే యొద్దని సూచించారు. కాన్ఫరెన్సులో కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాఖడే, జనరల్ అబ్జర్వర్ వెంకటేశ్వర్లు, డీఆర్వో వెంకటేశ్వర్లు, జడ్పీ సీఈవో శ్రీనివాస్, డీపీవో జగదీశ్వర్ పాల్గొన్నారు.

ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

కలెక్టర్ పమేలాసత్పతి

జిల్లాలో మూడు విడ తల్లో జరిగే గ్రామ పంచాయతీ ఎన్నికలను పకడ్బందీగా, ఎన్నికల నిబంధనల మేరకు నిర్వహించాలని కలెక్టర్, ఎన్నికల అధికారి పమేలా సత్పతి అధికారులు, ఉద్యోగులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్నికల సాధారణ పరిశీలకుడు వెంకటేశ్వర్లుతో కలిసి రెండో విడత పోలింగ్ ఆఫీసర్లు, సిబ్బందిని ర్యాండమైజేషన్ విధానంలో కేటాయించారు. రెండో విడతలో జరిగే చిగురుమామిడి, గన్నేరువరం, తిమ్మాపూర్, మానకొండూర్, శంకరపట్నం మండలాల్లో ఎన్నికల విధులను నిర్వహించనున్న సిబ్బందిని ఎంపిక చేసి వారికి ఎన్నికల నియామవళి, నిర్వహణపై పలు సలహాలు, సూచనలు చేశారు.

కొనసాగుతున్న నామినేషన్లు

గ్రామ పంచాయతీ తుది విడత ఎన్నికల నామినేషన్లు కొనసాగుతున్నాయి. హుజూరాబాద్, జమ్మికుంట, వీణవంక, సైదాపూర్, ఇల్లందకుంట మండలాల్లోని గ్రామాలకు ఎన్నికలు ఈ నెల 17న జరుగనున్నాయి. గురువారం ఐదు మండలాల్లో పెద్ద ఎత్తున నామినేషన్లు దాఖలయ్యాయి. శుక్రవారంతో నామినేషన్ల గడువు ముగియనుంది.

హుజూరాబాద్‌రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 20 గ్రామ పంచాయతీలు, 196 వార్డు స్థానాలకు గురువారం నామినేషన్లు స్వీకరించినట్లు ఎంపీడీవో తూర్పాటి సునీత తెలిపారు. 20 గ్రామ పంచాయతీల సర్పంచ్ స్థానాలకు 41 నామినేషన్‌లు దాఖలయ్యాయని, 196 వార్డు స్థానాలకు 157 నామినేషన్‌లు దాఖలాలైనట్లు తెలిపారు. రెండు రోజులకు కలిపి సర్పంచ్ స్థానాలకు 67, వార్డు మెంబర్ స్థానాలకు 230 నామినేషన్‌లు దాఖలాలు అయినట్లు తెలిపారు.

- **జమ్మికుంట రూరల్:** మండలంలో 20 గ్రామ పంచాయతీలు, 188 వార్డు స్థానాలు ఉన్నాయి. మండల పరిధిలో ఆరు క్లస్టర్లు ఏర్పాటు చేశారు. రెండు రోజుల్లో 20 సర్పంచ్ స్థానాలకు 49, 188 వార్డు స్థానాలకు 194 నామినేషన్లు దాఖలు అయ్యాయి. గంగ్రపల్లి, శంభునపల్లి, మడిపల్లి గ్రామాల సర్పంచ్ స్థానాలకు ఒక్క నామినేషన్ కూడా రాలేదు. గంగ్రపల్లి గ్రామంలో ఒక్క వార్డు స్థానానికి నామినేషన్ దాఖలు కాలేదు.
- **ఇల్లందకుంట:** మండలంలో రెండో రోజు గురువారం నామినేషన్లు జోరుగా సాగాయి. మండలంలోని 18 గ్రామపంచాయతీలకు ఐదు క్లస్టర్లలో సర్పంచ్ స్థానాలకు 39, వార్డు మెంబర్ స్థానాలకు 126మంది నామినేషన్లు దాఖలు చేసినట్లు అధికారులు తెలిపారు. రెండు రోజులకు కలిపి సర్పంచ్‌లకు 63, వార్డు మెంబర్లకు 157 నామినేషన్లు వచ్చాయి.
- **సైదాపూర్:** మండలంలోని ఏడు క్లస్టర్ల పరిధిలో 27 గ్రామ పంచాయతీలుండగా, 238 వార్డులున్నాయి. గురువారం సర్పంచ్ స్థానాలకు 49, వార్డు సభ్యులకు 130 నామినేషన్లు వచ్చాయి. రెండు రోజులకు కలిపి సర్పంచ్ స్థానాలకు 76, వార్డు సభ్యుల స్థానాలకు 178 నామినేషన్లు వచ్చాయి. చివరి రోజైన ఈ రోజు శుక్రవారం భారీ సంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యే అవకాశం ఉంది.
- **వీణవంక:** మండలంలోని 26 గ్రామాల పరిధిలో రెండో రోజు 45 మంది సర్పంచ్‌గా వార్డు సభ్యులుగా 187 మంది నామినేషన్ దాఖలు చేసినట్లు అధికారులు తెలిపారు. రెండు రోజులకు కలిపి సర్పంచ్‌లకు 70, వార్డు సభ్యులకు 231 నామినేషన్లు వచ్చాయి.

గ్రామపంచాయతీ ఎన్నికలకు పటిష్ట భద్రత

సీపీ గౌస్ ఆలం


వీణవంక మండలం చల్లూరు నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీపీ గౌస్ ఆలం

హుజూరాబాద్‌రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికలకు పటిష్ట భద్రతను ఏర్పాటు చేస్తున్నట్లు సీపీ గౌస్‌ఆలం అన్నారు. హుజూరాబాద్ మండలంలోని పెద్దపాపయ్యపల్లి, చిన్నపాపయ్యపల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సీపీ గురువారం పరిశీలించారు. అనంతరం ఎన్నికల బందోబస్తుపై అధికారులతో చర్చించారు. ఎన్నికల నామినేషన్ల స్వీకరణ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ఠ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.

నామినేషన్ల దాఖలు ప్రక్రియ ప్రశాంతంగా సాగేందుకు ఏర్పాటు చేయాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పోలింగ్ జరిగే రోజు అదనపు బలగాలను మోహరి స్తామన్నారు. పోలింగ్ కేంద్రాల పరిసరాలు కవర్ అయ్యేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయా లని సూచించారు. ఆయన వెంట ఏసీపీ మాధవి, సీఐలు కరుణాక ర్, లక్ష్మీనారాయణ, ఎస్ఐలు ఆవుల తిరుపతి, క్రాంతి కుమార్ ఉన్నారు.

- **వీణవంక:** మండలంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలైన వీణవంక, చల్లూరు, మామిడాలపల్లిలో ఏర్పాట్లను సీపీ గౌస్ ఆలం గురువారం పరిశీలించారు. రౌడీ షీటర్లు శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించా రు. నేర చరిత్ర ఉన్న వ్యక్తులను బైండోవర్ చేయాలన్నారు.
- **జమ్మికుంట రూరల్:** మండలంలోని సమస్యాత్మక గ్రామాలను సీపీ గౌస్‌ఆలం పరిశీలించారు. సమస్యాత్మక గ్రామాలైన జగ్గయ్యపల్లి, నాగంపేటలోని పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు పర్యవేక్షిం చారు. గతంలో నేర చరిత్ర ఉన్న వారి ఇళ్లకు వెళ్లి శాంతిభద్రతలకు విఘాతం కలిగించకూడదని, సత్ప్రవర్తనతో మెలగాలని, చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.
- **ఇల్లందకుంట:** మండలంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సీపీ గౌస్ ఆలం అన్నారు. మండలంలో పోలింగ్ కేంద్రాలను ఏసీ పీ మాధవితో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం గడ్డివానిపల్లెకు చెందిన రౌడీషీటర్‌ను బైండోవర్ చేశారు.

నీవెంటే నేను..

● మొదట భార్య.. తర్వాత భర్త

● 24 గంటల వ్యవధిలో

వృద్ధ దంపతుల మృతి

శంకరపట్నం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వృద్ధదంపతులు 24గంటల వ్యవధిలోనే మృతిచెందిన సంఘటన శంకరపట్నం మండలం ముత్తారం గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. శంకరపట్నం మండలం ముత్తారం గ్రామానికిచెందిన కనకం రాజమల్లు(80), రాజవ్వ(73) అనేవృద్ధదంపతులు కొంత కాలంగా వృద్ధాప్యంలో వచ్చే అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. బుధవారం భార్య రాజవ్వ అనారోగ్యంతో మృతి చెందగా, భర్త రాజమల్లు గురువారం మృతిచెందాడు. 24గంటల వ్యవధిలోనే భార్యభర్తలు మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

జీడీకే 2ఏ ఇంక్లైన్‌లో ప్రమాదం

● ఇద్దరు కార్మికులకు గాయాలు

గోదావరిఖని, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆర్‌జీ-1 పరిధిలోని జీడీకే2ఏ ఇంక్లైన్‌లో గురువారం రెండో షిఫ్టులో జరిగిన ప్రమాదంలో ఇద్దరు కార్మికులు గాయపడ్డారు. మ్యాన్‌రైడింగ్ చానల్స్‌కు మరమ్మతులు నిర్వహిస్తుండగా చక్రాలు ఊడిపోయి సునీంద్ర, మహేందర్‌రెడ్డి అనే జనరల్ అసిస్టెంట్ల చేతులపై పడడంతో చేతులకు తీవ్ర గాయాల య్యాయి. వెంటనే వారిని గోదావరిఖని సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించగా తీవ్రంగా గాయపడిన మహేందర్‌రెడ్డిని అక్కడి నుంచి మెరుగైన వైద్యంకోసం కరీంనగర్‌కు తరలించారు. ప్రమాదంపై అధికారులు విచారణ జరుపుతున్నారు.

ఎస్సైపై మానవ హక్కుల కమిషన్ విచారణ


మంథని, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీపాదకాలనీలో కేసు విచారణ పేరిట జరిగిన అవమానభారంతో శీలం రాజ్‌కుమార్ అనేయువకుడు ఇంట్లో ఆత్మహత్యాయత్నానికి పాల్పడి, చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటనపై మంథని ఎస్‌ఐపై రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ గురువారం విచారణ జరిపినట్లు హైకోర్టు న్యాయవాది ఇనుముల సత్యనారాయణ తెలిపారు. శీలం రాజ్‌కుమార్ మృతిపై, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ రాష్ట్రమానవ హక్కుల కమిషన్‌లో ప్రజాప్రయోజనార్థం మేరకు ఫిర్యాదుచేయగా కమిషన్ ఆదేశాల మేరకు ఎస్సై రమేష్ వ్యక్తిగతంగా హాజరు కాగా విచారణ అనంతరం కేసును జనవరి 8కి వాయిదా వేసినట్లు తెలిపారు.

రవాణాశాఖ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ

ఇల్లంతకుంట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో రవాణాశాఖ ఆధ్వర్యంలో గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. మండలకేంద్రంలో ఇతర రాష్ట్రాల రిజిస్ట్రేషన్‌తో అనుమతులు లేకుండా నడుస్తున్న లారీ, ట్రాక్టర్లను పట్టుకొని సీజ్‌చేసినట్లు ఎంవీఐ వంశీధర్ పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు సరైన ధ్రువ పత్రాలు ఉంటేనే రోడ్లపైకి రావాలని సూచించారు. వాహనదారులు తప్పనిసరిగా వాహనబీమా చేయించాలన్నారు. వ్యవసాయ ట్రాక్టర్లను రవాణా రంగానికి వినియోగించవద్దని సూచించారు. తనిఖీల్లో కానిస్టేబుల్ ప్రశాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తరం రాయండి..

బహుమతి పొందండి



● రెండు విభాగాల్లో పోటీలు

● ఈ నెల 8 వరకు ఉత్తరాలు పంపేందుకు గడువు

ముత్తారం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతికత పరుగులు పెడుతున్న ప్రస్తుత తరుణంలో కనుమరుగవుతున్న పాత సంప్రదాయాలను మళ్లీ గుర్తు చేసేందుకు తపాల శాఖ సంకల్పించింది. బంధువులకు, మిత్రులకు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలకు ఏదైనా సమాచారం చేరవేయాలంటే ఉత్తరాలు రాసే వారు. ఇది 25 ఏళ్ల క్రితం నాటి ముచ్చట. గతంలో ఉత్తరాలు రాయడం కోసం పోస్ట్ కార్డు, ఇన్‌లాండ్ లెటర్, కవర్ ఉపయోగించే వారు. ప్రస్తుతం సోషల్ మీడియా ప్రభావంతో సమాచారం అందించేందుకు క్షణ కాలం కూడా పట్టడం లేదు. దీంతో కొన్ని ప్రభుత్వ సంస్థలు మాత్రమే తపాలా శాఖ సేవలను వినియోగిస్తుంది. దీని కోసం తిరిగి ఉత్తరాలు రాయడాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో డాయీ ఆఖర్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రజలకు లెటర్ టు మై రోల్ మోడల్ అంశంపై పోటీ నిర్వహిస్తోంది. ఈ అంశంపై వ్యాసాలు రాసి పంపాలని, ఈనెల 8వ తేదీ వరకు ఉత్తరాలను పంపించాలని కోరుతోంది.

ఎవరు, ఎలా రాయాలి..

తపాల శాఖ ఉత్తరాలు రాసే పోటీని రెండు విభాగాలు విభజించారు. 18 ఏళ్లలోపు విభాగం, 18 ఏళ్ల దాటిన వారు వ్యాసాలు రాసి పంపాల్సి ఉంటుంది. తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషల్లో రాయవచ్చు. ఇన్‌లాండ్ లెటర్‌లో వ్యాసం రాసే వారు 500 పదాలకు మించకుండా, కవర్‌లో రాసే వారు 1000 పదాలకు మించకుండా ఏ4 సైజ్ పేపర్‌లో చేతి రాతతో రాసి పంపాలి. టైప్ చేసి పంపితే అంగీకరించరు. వ్యాసంతో పాటు అభ్యర్థులు తమ వయసు ధ్రువీకరణ పత్రం జత చేయాలి.

తపాల సర్కిల్లో ఉత్తరాలు రాయడంలో విజేతలుగా నిలిచే వారికి ప్రథమ బహుమతి రూ.25 వేలు, ద్వితీయ రూ.10వేలు, తృతీయ బహుమతి రూ.5 వేలు అందిస్తారు. జాతీయ విభాగంలో ప్రథమ రూ.50 వేలు, ద్వితీయ రూ. 25 వేలు, తృతీయ రూ. 10 వేలుపంపిణీ చేస్తారు.

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

సయ్యద్ అజారోద్దీన్, పోస్టల్ అధికారి, మంథని

ఉత్తరాల ద్వారా వ్యాసాలు రాసే పోటీని నిర్వహిస్తూ తపాలా శాఖ వారు బహుమతులు అందిస్తున్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. తమ లేఖలను ద చీఫ్ పోస్టు మాస్టర్ జనరల్, తెలంగాణ సర్కిల్, డాక్ సదన్, అబిడ్స్ హైదరాబాద్ 500001 చిరునామాకు ఈనెల 8వ తేదీలోగా పంపించాలి.

వైన్స్ ఏర్పాటు చేయవద్దని మహిళల రాస్తారోకో

● గ్రామ కార్యదర్శిని నిలదీసిన కాలనీవాసులు

కోరుట్ల రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కాలనీలో వైన్స్ ఏర్పాటుకు అనుమతించవద్దని మండలంలోని అయిలాపూర్ గ్రామ మహిళలు ఆందోళనకు దిగారు. వైన్స్‌కోసం షెడ్ నిర్మాణానికి ఎలా అనుమతిని ఇచ్చావని గ్రామకార్యదర్శిని నిలదీశారు. గురువారం మండలంలోని కోరుట్ల అయిలాపూర్ రోడ్డుపై అక్కడి కాలనీవాసులు ఆందోళనకు దిగి రాస్తారోకో చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కొన్ని రోజుల క్రితం మద్యం టెండర్లు నిర్వహించగా స్థానికంగా ఉన్న వైన్స్‌ను కోరుట్ల పట్టణానికి చెందిన వైన్స్ వ్యాపారులకు డ్రా ద్వారా దక్కించుకున్నారు. దీంతో వ్యాపారి అయిలాపూర్ నుంచి కోరుట్లకు వచ్చే రహదారిని ఆనుకోని ఉన్న ఓ స్థలంను లీజ్‌కు తీసుకోని షెడ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న కాలనీకి చెందిన మహిళలు వైన్స్ ఇక్కడ ఏర్పాటు చేయవద్దని డిమాండ్ చేస్తూ రాస్తారోకో చేశారు. వైన్స్ ఏర్పాటుచేస్తే కాలనీలో ఉన్న మహిళలు ఇబ్బందులుఎదుర్కొంటారని వైన్స్ ఏర్పాటుకు అనుమతించవద్దన్నారు. దీంతో కార్యదర్శి నవీన్ ఎక్సైజ్అధికారుల దృష్టికిసమస్యను తీసుకపోయి పరిష్కారానికి కృషి చేస్తానని హామీఇవ్వడంతో మహిళలు ఆందోళన విరమించారు. కాగా అయిలాపూర్ వైన్స్ గెజిట్‌లో లేదని ప్రచారం జరుగుతోంది. అక్కడ ఉన్న వైన్స్‌ను కోరుట్ల పట్టణానికి మార్చినట్లుగా సమాచారం.



రాస్తారోకో చేస్తున్న మహిళలు

అనుమతి లేని షెడ్.. ట్యాక్స్ చెల్లించని ఫంక్షన్ హాల్ సీజ్

కోరుట్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని మున్సిపల్ అధికారులు అనుమతి లేని షెడ్‌తో పాటు ట్యాక్స్ చెల్లించని ఫంక్షన్‌హాల్‌ను సీజ్‌చేశారు. గురువారం పట్టణంలోని నందిచౌరస్తా ప్రాంతంలో నూతనంగా నిర్మించిన షెడ్‌కు నిర్మాణ అనుమతి లేకపోవడంతో సీజ్ చేసినట్లు టౌన్‌ప్లానింగ్ అధికారులు, మున్సిపల్ కమిషనర్ రవీందర్ తెలిపారు. అదేవిధంగా పట్టణంలో మెట్‌పల్లి రోడ్డులోని ఓ ఫంక్షన్‌హాల్ రూ.14లక్షలు పెండింగ్‌లో ఉండగా సీజ్‌చేసినట్లు మున్సిపల్ కమిషనర్ తెలిపారు.



ఫంక్షన్ హాల్‌ను సీజ్ చేస్తున్న మున్సిపల్ అధికారులు

జీపీవో సస్పెన్షన్.. కేసు నమోదు

● రికార్డులో భూవిస్తీర్ణం పెంచి.. మరొకరి పేరు చేర్చిన వైనం

మల్యాల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): భూరికార్డులో భూవిస్తీర్ణం పెంచి, మరొకరి పేరు చేర్చి అక్రమంగా భూపట్టా చేసిన మండలంలోని బల్వంతాపూర్ జీపీవో ఈ ప్రవీణ్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఉత్తర్వులు జారీచేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని తాటిపల్లికి చెంది ధర్మవ్వకు చెందిన సర్వేనంబర్ 290/9లో అయిదు ఎకరాల భూమి ఉండగా భూమి పహానిలో భూవిస్తీర్ణం మరో 2.20ఎకరాలకు పెంచి అక్రమాలకు పాల్పడినట్లు అధికారులు గుర్తించి జీపీవోపై సస్పెన్షన్ వేటువేశారు. ధర్మవ్వ పహానీల కోసం దరఖాస్తు చేసుకోగా పెంచిన భూవిస్తీర్ణంను 2.20ఎకరాలను జవ్వాజి జలజ పేరిట నమోదు చేసినట్లు గుర్తించి అధికారులకు ఫిర్యాదు చేశారు.

విచారణ జరిపిన అధికారులు ప్రభుత్వ రికార్డులు, పహానీలను ట్యాంపరింగ్ చేసినట్లు గుర్తించారు. దీంతో తహసీల్దార్ వసంత ఫిర్యాదు మేరకు జీపీవో ప్రవీణ్, జలజపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు.

తల్లిదండ్రుల బాగోగులు చూడని కుమారుడికి నెల రోజుల జైలు

జగిత్యాల టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తల్లితండ్రుల బాగోగులు చూడని కుమారుడికి నెల రోజులు జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ జగిత్యాల మొదటి అదనపు జేఎఫ్‌సియం కోర్టు న్యాయమూర్తి శ్రీనిజ కోహిల్కర్ తీర్పు చెప్పారు. జగిత్యాల పట్టణం గంజ్ స్ట్రీట్‌కు చెందిన వయోవృద్ధులైన మండలోజు సత్యవతితోపాటు ఆమెభర్త బాగోగులు చూసుకోకుండా ఇళ్లను రిజిస్ట్రేషన్ చేయమని తన కొడుకు రమేష్ ఇబ్బందులకు గురి చేస్తున్నాడని 2021లో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి సీఐ కిషోర్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టి చార్జిషీట్ దాఖలు చేశారు. ప్రస్తుత సీఐ కరుణాకర్ సూచనల మేరకు హెడ్ కానిస్టేబుల్ ఏ రాజేశ్వరరావు కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టగా పీపీ బి. రాజేష్ బాధితురాలు తరుపున వాదించారు. సాక్ష్యాలు పరిశీలించి, విచారణ అనంతరం న్యాయమూర్తి శ్రీనిజ కోహిల్కర్ నిందితుడికి నెల రోజులు జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

కొండలరాయుడి కోటపై నుంచి దూకిన యువకుడు

మల్యాల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు కొండపైన గల కొండలరాయుడి కోటనుంచి మతిస్థిమితంలేని వ్యక్తి దూకగా తీవ్రగాయాలతో బయటపడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట జిల్లా మద్దునూరు మండలం జాలపల్లికి చెందిన యాసవేణి ధీరజ్ అనే యువకుడు కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో కుటుంబసభ్యులు వారంరోజుల క్రితం కొండగట్టు అంజనేయస్వామి సన్నిధికి తీసుకువచ్చారు. ఈ క్రమంలో కొండపైన ఉంటున్న మతిస్థిమితం సరిగాలేని ధీరజ్ గురువారం ఆలయం వెనకాల గల కొండలరాయుడి కోట బండరాళ్ల వద్దకు వెళ్లి లోయలోకి దూకాడు. గమనించిన అక్కడున్న కొందరు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పోలీస్ అవుట్‌పోస్టు ఏఎస్సై చిలుక శ్రీనివాస్, హోంగార్డులు రాజేశ్, వెంకటేశ్, సెక్యురిటీ గార్డు కుమార్ కొంతమంది భక్తులు కలిసి అతన్ని లోయ నుంచి బయటకు తీసుకువచ్చారు. ధీరజ్‌కు వెనుక వైపులో గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

కొంగుకు నిప్పంటుకొని వృద్ధురాలికి తీవ్ర గాయాలు

కోరుట్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లక్ష్మి అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న వాసాల పద్మ(85) అనే వృద్ధురాలి చీరకొంగుకు నిప్పంటుకోవడంతో తీవ్రగాయాలు అయినట్లు స్థానికులు తెలిపారు. అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న తన కూతురు వకుల ఇంటికి వచ్చిన పద్మ చలికాలం ఎండ కోసం గ్యాలరీ పక్కన ఉన్న కుర్చీలో కూర్చోంది. పక్కన తులసిచెట్టు వద్ద దీపం వెలిగించి ఉండగా ప్రమాదవశాత్తూ వృద్ధురాలి చీర కొంగు దీపంపై పడి మంట అంటుకుంది. ఘటనలో పద్మ తీవ్ర గాయాల పాలు కాగా కుటుంబసభ్యులు చికిత్సనిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాదు తరలించినట్లు స్థానికులు తెలిపారు.

తండాలో పోలీసుల సోదాలు

● 80 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం..

● 10 లీటర్ల సారా స్వాధీనం

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలం రాశిగుట్టతండాలో ఎస్‌ఐ లక్ష్మణ్ ఆధ్వర్యంలోని పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. పలువురి ఇళ్లల్లో సోదాలు జరిపారు. సారా తయారీ కేంద్రాలను కనుగొన్నారు. నిల్వచేసిన 80లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. తరలించేందుకు సిద్ధంగా ఉన్న 10 లీటర్ల సారాను స్వాధీనపర్చుకున్నారు. తయారీదారులు నేమీ, కవితపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ లక్ష్మణ్ పేర్కొన్నారు.

తవ్వారు.. వదిలేశారు..

మానకొండూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగిపల్లిలో తాగునీటి పైపు లైన్ కోసం రోడ్డు పక్కన గుంత తవ్వి వదిలేయడంతో ప్రమాదకరంగా మారింది. గుంతను పూడ్చివేయాలని కాలనీ వాసులు, వాహనదారులు కోరుతున్నారు. గంగిపల్లి ఎస్సీకాలనీ, కొండపల్కలకు వెళ్లే ప్రధాన రహదారి పక్కన పైప్‌లైన్ నిర్మాణం కోసం గుంత తవ్వి వదిలేశారు. సింగిల్ తారు రోడ్డు కావడంతో పెద్ద వాహనం వెళ్లే సమయంలో స్థలం సరిపోక ప్రమాదాలు జరుగుతున్నాయని కాలనీ వాసులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించాలని, గుంత పూడ్చివేతకు చర్యలు చేపట్టాలని కోరారు.



గంగిపల్లిలో రోడ్డు పక్కన తవ్వి వదిలేసిన గుంత

రానున్న వేసవికి పటిష్ట కార్యాచరణతో సిద్ధంగా ఉండాలి

అధికారులతో సమీక్షలో ఎస్ఈ మేక రమేష్‌బాబు

గణేశ్‌నగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రానున్న వేసవి కాలంలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా కార్యాచరణతో సిద్ధంగా ఉండాలని విద్యుత్ అధికారులకు సూపరింటెండింగ్ ఇంజనీర్ కరీంనగర్ మేక రమేష్‌బాబు దిశానిర్దేశం చేశారు. గురువారం సమావేశమందిరంలో ఏర్పాటు చేసిన సమీక్షలో ఆయన మాట్లాడారు. రాబోయే వేసవి కార్యచరణ ప్రణాళిక సిద్ధంగాఉండాలని ఏఈలకు, ఏడీలకు సూచించారు. ఎక్కడైతే పవర్ ట్రాన్స్ఫార్మర్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ఫార్మర్లు ఓవర్‌లోడ్ అయ్యే అవకాశం ఉందో అక్కడ అదనపు సామర్థ్యం పెంపుదల ట్రాన్స్ఫార్మర్ పెట్టాలని ఆదేశించారు. 33కేవీ, 11కేవీ లైన్లు ఓవర్ లోడ్ అయ్యే అవకాశం ఉన్నచోట కొత్త లైన్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. వినియోదారులకు అంతరాయం లేకుండా 33కేవీ, 11కేవీ మెయింటెనెన్స్ చేయాలన్నారు. వ్యవసాయ సర్వీస్ అప్లికేషన్లు 15 రోజుల్లోపు సర్వీస్ కనెక్షన్ ఇవ్వాలని, గృహ, వాణిజ్య మీటర్లు ఏడు రోజుల్లోపు రిలీజ్ కావాలని ఆదేశించారు. 1912ఫోన్ ద్వారా వినియోగదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే విద్యుత్ ప్రమాదాలు జరగకుండా పొలంబాట, పల్లెబాట, బస్తీబాట, పట్టణబాట నిర్వహించి వినియోదారులకు అవగాహన సదస్సు నిర్వహించి విద్యుత్‌ప్రమాదాలు జరగకుండా అవగాహన కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో డీఈలు కే ఉపేందర్, రాజం, లక్ష్మారెడ్డి, ఎం తిరుపతి, ఎస్ఏవో రాజేంద్ర ప్రసాద్, ఏవోలు, ఏఏవోలు, ఏడీఈలు, ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ అధికారులతో సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ మేక రమేష్‌బాబు

ఉమ్మడి జిల్లాలో నలుగురి బలవన్మరణం

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నలుగురు వివిధ కారణాలతో బలవన్మరణానికి పాల్పడ్డారు. వివరాల్లోకి వెళితే..

రైలు కిందపడి ఒకరి ఆత్మహత్య



రజనీకాంత్(ఫైల్)

జమ్మికుంట రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట మండలం బిజిగిరిషరీఫ్-పొట్కపల్లి రైల్వేస్టేషన్ల మధ్య గుర్తుతెలియని రైలు కిందపడి ఓ వ్యక్తి గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జమ్మికుంట మండలం తనుగుల గ్రామానికిచెందిన జక్కు రజనీకాంత్(31) అనేవ్యక్తి కూలి పనిచేస్తూ జీవనం సాగించేవాడు. ఏడాదిగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కుటుంబ సభ్యులు ఆసుపత్రుల్లో చూపించినా ఆరోగ్యం కుదుటపడలేదు. దీంతో తీవ్ర మనస్థాపం చెంది బిజిగిరి షరీఫ్-పొట్కపల్లి రైల్వేస్టేషన్ల మధ్య గుర్తుతెలియని రైలుకిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి రమ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తు న్నట్లు రామగుండం రైల్వేహెడ్ కానిస్టేబుల్ జి తిరుపతి తెలిపారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య



రాజిరెడ్డి(ఫైల్)

ముస్తాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఇందిరమ్మకాలనీలో మద్యానికి బానిసై ఓవ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చోటుచేసుకుంది. ఎస్సై సీహెచ్ గణేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ముస్తాబాద్‌కు చెందిన సద్ది రాజిరెడ్డి(40) భార్య కొన్నేళ్లక్రితం చనిపోయింది. రాజిరెడ్డి డ్రైవర్ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొద్దిరోజులుగా పనిలేకపోవడంతో మద్యానికి బానిసైన రాజిరెడ్డి ఒంటరితనంతో మనస్థాపంచెంది బుధవారం రాత్రి ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడితల్లి సత్తవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గణేశ్ తెలిపారు.

తల్లిదండ్రులు మందలించారని ఉరి వేసుకున్న యువకుడు



అరవింద్(ఫైల్)

పెగడపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పెగడపల్లి మండలం రాములపల్లి గ్రామానికి చెందిన నీలం అరవింద్(23) అనేయువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాములపల్లి గ్రామానికి చెందిన నీలం అరవింద్ బీటెక్ పూర్తిచేసి ఉద్యోగాన్వేషణలో ఉండగా బుదవారం సాయంత్రం తల్లిదండ్రులు ఏదైనా పనిచేసుకుని బతకాలని సూచించగా మనస్థాపంతో ఇంట్లోనే ఉరివేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్సనిమిత్తం జగిత్యాల ఆసుపత్రికి తరలించగా రాత్రి చనిపోయినట్లు తెలిపారు. మృతుడి తండ్రి రమేష్ ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో మహిళ ఆత్మహత్య



అంజవ్వ(ఫైల్)

చందుర్తి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలతో ఓ మహిళ ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చందుర్తి మండలం బండపల్లిలో జరిగింది. గ్రామస్థుల, చందుర్తి ఎస్సై రమేష్ కథనం ప్రకారం... మండలంలోని బండపల్లి గ్రామానికి చెందిన నేదూరి అంజవ్వ(55) అనే మహిళకు భర్త పోశయ్యతో పాటు ముగ్గురు కుమారులు ఉన్నారు. జీవనోపాధి కోసం హార్వెస్టర్ కొనుగోలు చేయగా ఆర్థికంగా నష్టపోయారు. హార్వెస్టర్ విక్రయించిన అప్పులు తీరలేదు. వ్యవసాయంలో వచ్చిన నష్టంతో పూర్తిగా దివాళా తీశారు. దీంతో అప్పులిచ్చినవారు చెల్లించాలని కోరారు. ముగ్గురుకుమారులు పట్టించుకోకపోవడంతో తీవ్రమనస్థాపానికి లోనైనా అంజవ్వ ఇంట్లో ఉరివేసుకుంది. భర్త పోశయ్య ఫిర్యాదు మేరకు కేసునమోదుచేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై రమేష్ తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ దుర్మరణం



జితేందర్(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పొలాన్ని దున్నేందుకు గురువారం కేజ్‌వీల్స్‌ను ట్రాక్టర్ వెనుక నాగళ్లపై వేసుకుని వెళ్తున్న క్రమంలో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ గడ్డం జితేందర్(36) దుర్మరణం పాలయ్యాడు. కుటుంబ సభ్యులు, ఎస్ఐ రాహుల్‌రెడ్డి కథనం మేరకు.. జితేందర్ గ్రామానికి చెందిన శ్రీను అనేవ్యక్తి ట్రాక్టర్‌ను నడుపుతూ జీవిస్తున్నాడు. పొలాన్ని దున్నేందుకు ట్రాక్టర్ వెనుకఉన్న నాగళ్లపై కేజ్‌వీల్స్ వేసుకుని వెళుతున్న క్రమంలో ఒక్కసారిగా కేజ్‌వీల్స్ ఎగిరి కిందిపడ్డాయి. దీంతో జితేందర్ వాహనం వెనుక వైపునకు చూడడం వల్ల ట్రాక్టర్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న వ్యవసాయ పొలంలో బోల్తాపడింది. చుట్టుపక్కల రైతులు గమనించి ట్రాక్టర్ కింద చిక్కుకున్న ఆయను తీసేందుకు యత్నించారు. మరోట్రాక్టర్ సహాయంతో బోల్తాపడిన వాహనాన్ని తొలగించారు. అప్పటికే జితేందర్ చనిపోయాడు. మృతుడికిభార్య దివ్య, కొడుకు విశాల్, తల్లి లక్ష్మి ఉన్నారు. ఎస్ఐ రాహుల్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు అక్కడకు చేరుకుని ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

వెల్గటూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిషన్‌రావుపేట గ్రామశివారులో ఈనెల29న రోడ్డుప్రమాదంలో గాయపడిన లక్ష్మణ్‌రావు (36) అనేయువకుడు చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. ఎస్సై ఉదయ్‌కుమార్ తెలిపిన వివరాలప్రకారం.. ఈనెల29న రాత్రి సమయంలో ముత్తునూర్ గ్రామానికిచెందిన గొల్లకల్యాణ్, కొత్తపేట గ్రామానికి చెందిన లక్ష్మణ్‌రావు ఎదురెదురుగా ద్విచక్రవాహనాలపై ప్రయాణిస్తూ ఢీకొన్నారు. ఈ సంఘటనలో లక్ష్మణ్‌రావు తలకు తీవ్ర గాయాలు కాగా కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. కాగా పరిస్థితి విషమించడంతో గురువారం చికిత్సపొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబాన్ని పోషించే పెద్దదిక్కును కోల్పోవడంతో ఆ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడి భార్య సహజ ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై తెలిపారు.

కువైట్‌లో ముస్తాబాద్‌వాసి మృతి



వేదుల్(ఫైల్)

ముస్తాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన ఎండీ వేదుల్(36) కువైట్‌లో అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతిచెందాడు. వేదుల్ నాలుగు నెలలక్రితం ఫుడ్ పాయిజన్‌తో అనారోగ్యానికి గురయ్యాడు. ఆసుపత్రిలో చికిత్సపొందుతూ పరిస్థితివిషమించి మృతి చెందాడు. వేదుల్‌కు భార్య షబానా, ఇద్దరు పిల్లలున్నారు. పేదకుటుంబానికి చెందిన వేదుల్ మృతదేహం స్వగ్రామం చేరేలా చూడాలని కుటుంబసభ్యులు వేడుకుంటున్నారు.

కుక్కల దాడిలో మేకలు మృతి

ఎండపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుల్లకోట గ్రామంలో గురువారం రోజున కుక్కలదాడిలో 12మేకలు మృతిచెందాయి. బాధితుడి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన అమరగొండ దివాకర్ మేకలు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఎప్పటిలాగే మేపడానికి వెళ్లాడు. అనా రోగ్యంతో నడవలేని కొన్ని మేకలను గూటిలో వేసి మిగతా వాటితో వెళ్లాడు. మధ్యాహ్నం సమయంలో ఎవరూలేని సమయంలో ఒక్కసారిగా కుక్కలుమేకలపై దాడిచేసి చంపాయి. వాటివిలువ సుమారు లక్షపైగా ఉంటుందని ప్రభుత్వం ఆదుకోవాలని దివాకర్ వేడుకుంటున్నాడు.

ఎస్‌జీఎఫ్ రాష్ట్ర క్రికెట్ పోటీలకు గంగాధర విద్యార్థి


అస్లాం

గంగాధర, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గంగాధర ప్రభుత్వ జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థి అస్లాం ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ బాబు శ్రీనివాస్ తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో అండర్ 14 ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహించగా పాఠశాలకు చెందిన అస్లాం అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైయినట్లు పీడీ తెలిపారు. ఈ నెల 5 నుండి 7 వరకు భద్రాది కొత్తగూడెం జిల్లా హస్నాపురంలో జరగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారుడిని ప్రధానోపాధ్యాయురాలు అనితకుమారి, ఎంపీడీవో రాము, ఎంఈవో ప్రభాకర్‌రావు, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక


ఈర్ల శ్రీజ

ధర్మపురి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని మగ్గిడి ఆదర్శ కళాశాల విద్యార్థి ఈర్ల శ్రీజ అండర్ 19 ఖోఖో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలో ఇటీవల జరిగిన ఖోఖో పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచింది. హైదరాబాద్‌లో ఈ నెల 6, 7వ తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి విద్యార్థి శ్రీజ ప్రాతినిధ్యం వహిస్తోంది. శ్రీజను ఆదర్శ కళాశాల ప్రిన్సిపాల్ పద్మ, వైస్ ప్రిన్సిపాల్ మహేష్, ఫిజికల్ డైరెక్టర్ రాజేందర్, అధ్యాపకులు ప్రత్యేకంగా అభినందించారు.

కొండగట్టులో గిరి ప్రదక్షిణ


మల్యాల, డిశంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రతి పౌర్ణమి రోజు కొండగట్టు ఆంజనేయస్వామి గిరుల చుట్టూ నిర్వహిస్తున్న గిరిప్రదక్షిణ గురువారం నిర్వహించారు. హైదరాబాద్ చిలుకూరు బాలాజీ ఆలయంలోని శివాలయం ప్రధానార్చకులు సురేశ్ ఆత్మారాం మహారాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన గిరిప్రదక్షిణకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. అయ్యప్ప దీక్షాపరులు దిగువ కొండగట్టులో పూజలు నిర్వహించి ప్రదక్షిణ ప్రారంభించారు. గిరి ప్రదక్షిణ ముగిసిన అనంతరం కొండపైన స్వామి వారిని దర్శించుకున్నారు.

లక్ష్మీనర్సింహస్వామి కల్యాణోత్సవం


శ్రీ లక్ష్మీనర్సింహస్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

తంగళ్లపల్లి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండల కేంద్రంలోని లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. చినజీయర్‌స్వామి శిష్య బృందం శ్రీకాంత్ ఆచార్యులు, రామకృష్ణమాచార్యులు, శశాంక్, వినయ్‌కుమార్ ఆచార్యులు, శ్రీకాంతకౌశిక్, వివేక్ స్వామిలే వేదమంత్రాలతో కల్యాణం నిర్వహించగా వేలాది మంది భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం మాజీ జడ్పీటీసీ కోడి అంతయ్యతో పాటు భక్తుల సహకారంతో అన్నదానం నిర్వహించారు.

ఎన్నికల నిబంధనలు కఠినం



పాటించకపోతే పదవీ గండం
మూడేళ్ల పాటు పోటీలకు దూరం

సుల్తానాబాద్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నియమ నిబంధనలు కఠినంగా ఉన్నాయి. అభ్యర్థులు తెలిసి తెలియక వాటిని ఉల్లంఘిస్తే ఇబ్బందులు పడాల్సి ఉంటుంది. ముఖ్యంగా అభ్యర్థులు తమ ఎన్నికల నామినేషన్లు దాఖలు చేసిన రోజు నుంచి పక్కగా లెక్కలు పరిగణనలోకి వస్తాయి. రూపాయి రూపాయి లెక్క చేస్తారు. ఎవరు చూస్తున్నారంటూ నిర్లక్ష్యం చేస్తే గెలిచాక పదవి ఊడిపోతుంది. దీంతో పాటు మరో మూడేళ్ల పాటు ఏ ఎన్నికలలో పోటీ చేయకుండా అనర్హత విధిస్తారు. అందుకని గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు తమ ఎన్నికల ప్రచారంలో భాగంగా చేసే ప్రతీ ఖర్చు వివరాలను ఎన్నికల సంఘానికి తప్పకుండా తెలుపాలి.

అయితే ఎన్నికలకు సంబంధించిన ఖర్చులన్నింటినీ కొత్త బ్యాంక్ ఖాతా ద్వారా మాత్రమే నిర్వహించాల్సి ఉంటుంది. ఎన్నికలకు సంబంధించిన లావాదేవీ లన్నింటినీ ఆ ఖాతా ద్వారా మాత్రమే నిర్వహించాలి. ప్రతీ అభ్యర్థి తన గెలుపు ఓటములతో సంబంధం లేకుండా ఎన్నికలు ముగిసిన 45 రోజుల లో తనకు సంబంధించిన ఎన్నికల ఖర్చు వివరాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు సమర్పించాలి.

ఒకవేళ గెలిచిన అభ్యర్థులు ఆ సంబరంలో సకాలంలో ఖర్చు వివరాలను అధికారులకు ఇవ్వడం మరిచిపోతే పదవి కోల్పోవడంతో పాటు మూడేళ్ల అనర్హత వేటు పడుతుంది.

మర్చిపోకుండా ఎన్నికల ఖర్చు వివరాలను గెలుపు ఓట ములతో సంబంధం లేకుండా నిర్ణీత గడువులోగా అధికారులకు సమర్పించాలి. అభ్యర్థులు తమ ఎన్నికల ప్రచారంలో భాగంగా చేస్తున్న అన్ని ఖర్చులను ఎన్నికల కమిషన్‌కు సంబంధించిన నిఘా బృందాలు గమనిస్తూ ఖర్చును అంచనా వేస్తుంటాయి. నిఘా బృందాలు రికార్డు చేసిన ఖర్చు మొత్తాన్ని కూడా అభ్యర్థుల పేరుతో నమో దు చేస్తాయి. సాధ్యమనంత వరకు ఎన్నికల వ్యయ పరిమితికి లోబడి మాత్రమే ఖర్చులు చేస్తూ వాటిని నమోదు చేసుకోవాలి.

అభ్యర్థులకు ఎన్నికల ఖర్చు వివరాలు

సర్పంచ్ స్థానానికి పోటీ చేసే అభ్యర్థి గ్రామ జనాభా 5 వేల లోపు ఉంటే లక్షా 50 వేల రూపాయలు, వార్డు స భ్యుడికి పోటీ చేసే అభ్యర్థి 30 వేలు, 5 వేల జనాభా దాటితే 2.50 లక్షల రూపాయలు, వార్డు సభ్యుడు అభ్య ర్థి 50 వేల రూపాయ లకు మించకుండా ఖర్చు చేయాల్సి ఉంటుంది. అభ్యర్థుల గెలుపు కోసం రాజకీయ పార్టీలు పెట్టే ఖర్చును అభ్యర్థుల ఖాతా ల్లోనే జమ చేస్తారు.

అభ్యర్థుల ఖర్చుపై ఎప్పటికప్పుడు సర్వైవల్ టీమ్స్, ఎన్నికల వ్యయ పరిశీలకులు, వీడియోలు, ఫొటోల చిత్రీకరణ చేసి ఖర్చును లెక్కిస్తారు. అభ్యర్థులు చేసిన ఖర్చుకు సంబంధించి తక్కువ చేసి లెక్క లు సమర్పించినప్పుడు వీడియోలు, ఫొటోలను పరిశీలించి సరి చేస్తారు. ఎన్నికల కోసం వాడే ప్రచార సామగ్రి, తదితర వాటికి ఎన్నికల సం ఘం ధరలు నిర్ణయించింది. ఆ ధరల ప్రకారమే అభ్యర్థులు ఎన్నికల ఖర్చు చూపాల్సి ఉంటుంది. ఎన్నికల సందర్భంగా అభ్యర్థులు బ్యానర్లు, పోస్టర్లు, కరపత్రాలు, బ్యాడ్జీలు, వాల్ రైటింగ్స్, నమూనా బ్యాలెట్లు, తదితర ముద్రించి ఓటర్లకు పంపిణీ చేస్తారు. ప్రచారానికి మైకులు, లౌడ్ స్పీకర్లు వినియోగిస్తుంటారు. వీటన్నింటికీ ఎన్నికల సంఘం ధరలు నిర్ణయించింది.

13న నవోదయ ప్రవేశ పరీక్ష

చొప్పదండి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 13న నవోదయ 6వ తరగతి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బ్రహ్మానందరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 34 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు 6,892 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు. విద్యార్థులు తమ అడ్మిట్ కార్డులను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని, అడ్మిట్ కార్డులో ఏవైనా పొరపాట్లు ఉంటే ఈ నెల 6లోగా చొప్పదండిలోని నవోదయ విద్యాలయంలో సరిచేయించుకోవాలన్నారు. మార్పులు ఏవైనా ఉనట్లయితే సంబంధిత ఆధార పత్రాలు తీసుకొని విద్యాలయానికి రావాలని ఆయన సూచించారు.

విద్యారంగ సమస్యలపై ఏబీవీపీ కృషి

గణేశ్‌నగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలపై ఏబీవీపీ కృషి చేస్తుందని, భారత్‌ను విశ్వగురు స్థానంలో నిలపడమే లక్ష్యమని సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మల్యాల రాకేష్ అన్నారు. గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత నెల 28, 29, 30 తేదీల్లో ఉత్తరాఖండ్‌లో సంఘం 71వ జాతీయ మహాసభలు నిర్వహించినట్లు చెప్పారు. ఏబీవీపీ ఉద్యమాలు, విజయాలు, రావాల్సిన మార్పులపై చర్చించామన్నారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లా కన్వీనర్ పూసాల విష్ణు, నగర కార్యదర్శి చిప్ప యోగేష్, వంశీ,శివ , ఆకాష్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ సంస్థలకు కేంద్ర ప్రభుత్వం దాసోహం

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి



మాట్లాడుతున్న చాడ వెంకటరెడ్డి

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బీజేపీ పది సంవత్సరాల పాలనలో కార్పొరేట్ సంస్థలు, బడా పెట్టుబడుదారులైన అంబానీ, ఆదానీలు వేల కోట్ల రూపాయలు సంపాదించుకున్నారని, కార్పొరేట్లకు కేంద్ర ప్రభుత్వం దాసోహమైందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి పేర్కొన్నారు. గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం సీపీఐ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచంలో మూడవ ఆర్థిక దేశంగా భారతదేశం రూపొందుతోందని ప్రధానమంత్రి అబద్ధాలు చెపుతున్నాడని అన్నారు. బీఎస్ఎన్ఎల్, విశాఖ స్టీల్ ప్లాంట్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలను ధ్వంసం చేస్తున్నారన్నారు. బ్యాంకులను ప్రైవేటుపరం చేసే కుట్రలు చేస్తున్నారన్నారు. బూటకపు ఎన్‌కౌంటర్లపై జ్యూడీషియల్ ఎక్వైరీ వేయాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ పచ్చని కొబ్బరిచేలను చూసి తెలంగాణ వారి కళ్లు మండుతున్నాయనడం ఆయన అహంకార పూరిత వ్యాఖ్యలకు నిదర్శనమన్నారు. సిరిసిల్ల, కరీంనగర్, జగిత్యాల జిల్లాలు పచ్చని పొలాలతో విలసిల్లుతున్నాయన్నారు. నిస్వార్థంగా ప్రజాసేవ చేసే వారినే ఎన్నుకోవాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి 73, 74 రాజ్యాంగ సవరణ ఎందుకు అమలు చేయలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మాజీ సర్పంచ్‌ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని వారి పరిస్థితి ఏమిటన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి సుదర్శన్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

జనవరి 7న శబరిమలకు ప్రత్యేక రైలు

పెద్దపల్లి, డిసెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప స్వామి భక్తుల సౌకర్యార్థం శబరిమలకు జనవరి 7వ తేదీన మరో ప్రత్యేక రైలు నడుపుతామని దక్షిణ మధ్య రైల్వే అధికారులు ప్రకటించారు. రైలు నంబర్ 07133 నాందేడ్ నుంచి ఉదయం 4:25 గంటలకు బయలుదేరుతుంది.. కోరుట్లకు 8:30 గంటలకు, జగిత్యాలకు 9 గంటలకు, కరీంనగర్‌కు 10 గంటలకు, పెద్దపల్లి జంక్షన్‌కు 10:50 గంటలకు చేరుకోనున్నది. ఇక్కడి నుంచి 11:40 గంటలకు బయలు దేరి జమ్మికుంట 12:20, వరంగల్‌కు మధ్యాహ్నం 1:18 గంటలకు, తిరుపతికి రాత్రి 1:20 గంట లకు, కొల్లాం మరుసటి రోజు రాత్రి 10 గంటలకు చేరుకోనున్నది. తిరుగు ప్రయాణంలో రైలు నంబర్ 07134 కొల్లాం నుంచి ఉదయం 2:30 గంటలకు బయలు దేరి, నాందేడ్‌కు మరుసటి రోజు సాయంత్రం 5:30 గంటలకు చేరుకోనున్నది.

అరటి సాగుపై రైతులు దృష్టిసారించాలి


అరటి తోటను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యాన అధికారులు

జగిత్యాలరూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రైతులు సంప్రదాయ వరి పంటనే కాకుండా అధిక ఆదాయాన్ని అందించే అరటి సాగుపై దృష్టి సారించాలని జగిత్యాల జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారి జి. శ్యాం ప్రసాద్ రైతులకు సూచించారు. జగిత్యాల రూరల్ మండలంలోని అంతర్గాంలో పండిస్తున్న అరటి తోటలను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరటి మొక్కలు నాటుకోవడానికి అనువైన సమయమని అన్నారు. టిష్యూకల్చర్ అరటి మొక్కలు తెచ్చి నాటుకుంటే అధిక దిగుబడి వస్తుందన్నారు. బిందు సేద్యం ద్వారా నీరు అందిస్తే కలుపు సమస్య తక్కువగా ఉండి అధిక దిగుబడి సాధించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో నియోజవర్గ ఉద్యాన అధికారి కె. స్వాతి, ఉద్యాన విస్తరణ అధికారి అన్వేష్ ఉన్నారు.

వర్గీకరణతో మాల సామాజిక వర్గానికి సీఎం అన్యాయం


మాట్లాడుతున్న మాల సంఘాల జేఏసీ చైర్మన్ మందాల భాస్కర్

సిరిసిల్ల టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విస్మరించి మాల సామాజిక వర్గానికి రిజర్వేషన్లు లేకుండా గొంతు కోశాడని తెలంగాణ మాల సంఘాల జేఏసీ చైర్మన్ మందాల భాస్కర్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రం అంబేద్క ర్ చౌరస్తాలోని బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి జేఏసీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఓటు బ్యాంక్ రాజకీయాల కోసం మాల సామాజిక వర్గానికి చెందిన 26 కులాలను రిజర్వేషన్లు లేకుండా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఆరు నెలలుగా ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలలో వేయి పోస్టులకు మాల సామాజిక వర్గానికి 28 పోస్టులు వచ్చాయని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్లు చేస్తుంటే కాంగ్రెస్‌లో ఉన్న మాల సామాజిక వర్గానికి చెందిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామి, స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఎంపీలు, ఎమ్మెల్యేలు కళ్లు మూసుకున్నారన్నారు. మాల సామాజిక వర్గం సత్తా చాటకపోతే భవిష్యత్తులో విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉండవన్నారు. సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్‌ను ముఖ్యమంత్రి పాటించి ఉండే మాల సామాజిక వర్గానికి ఏడు శాతం రిజర్వేషన్లు వచ్చేవని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు చెరుకు రామ్‌చందర్, గ్రేటర్ హైదరాబాద్ చైర్మన్ బేరా బాలకిషన్, వైస్ చైర్మన్ తుమ్మ శ్రీనివాస్, ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ తుంగ శివరాజ్, కో కన్వీనర్ జక్కుల యాదగిరి, స్టూడెం ట్ జేఏసీ చైర్మన్ మాదాసి రాహుల్, ఓయూ జేఏసీ చైర్మన్ బత్తుల రమేష్, జిల్లా నాయకులు బూర యాదగిరి, బొల్లం గణేష్, పాటి రాజ్‌కుమార్ ఉన్నారు.

ధాన్యంలో కోతపై రైతుల ఆందోళన

చొప్పదండి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుక్మాపూర్‌లో రాయపట్నం రహదారిపై కాట్నపల్లికి చెందిన పలువురు రైతులు ఆందోళన నిర్వహించారు. ధాన్యం కొనుగోళ్లలో కోత విధించారని రైస్ మిల్లర్లపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళన చేశారు. ధాన్యం నాణ్యంగా ఉన్నప్పటికీ 42 కిలోల బస్తా తూకం వేసి పంపినప్పటికీ అదనంగా మరో కిలో కోత విధించారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమాచారం తెలుసుకున్న అధికారులు రైతులతో మాట్లాడగా శాంతించారు.

డిపో మేనేజర్లతో సమావేశం

భగత్‌నగర్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఆర్టీసీ రీజియన్ పరిధిలోని డిపో మేనేజర్లతో గురువారం రీజినల్ మేనేజర్ బి రాజు సమీక్ష సమావేశం నిర్వహించారు. నవంబరు మాసాంతం వరకు అన్ని డిపోల పనితీరు, పరమాదాలు నివారణ చర్యలు, రానున్న మేడారం జాతర ఏర్పాట్లు, శబరిమలై ప్యాకేజీ టూర్లు, యాత్రాదానంకు ప్రజల నుంచి వస్తున్న ఆదరణపై సమీక్షించారు. ఈ సమావేశంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్లు ఎస్ భూపతిరెడ్డి, పి మల్లేశం, అన్ని డిపోల మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్ట్ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష


ఎయిర్‌పోర్ట్ అథారిటి అధికారులతో ఎమ్మెల్యే మక్కాన్ సింగ్

జ్యోతినగర్, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): అంతర్గాం మండల కేంద్రంలోని ప్రతిపాదిత విమానాశ్రయ ఏర్పాటు స్థల పరిశీలనకు ఢిల్లీ నుంచి వచ్చిన ఎయిర్‌పోర్ట్ అథారిటీ అధికారులు బానోతు శ్రీనివాస్ తదితర బృంద సభ్యులను ఎమ్మెల్యే మక్కాన్ సింగ్‌ఠాకూర్ కలిశారు. ఎన్టీపీసీ జ్యోతిభవన్‌లో ఎమ్మెల్యే వారిని కలిసి చర్చించారు. ప్రతిపాదిత 977 ఎకరాల స్థలాన్ని అధికారులు పరిశీలించగా, గతంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులతో సమీక్షించినట్లు ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే పూర్తిస్థాయిలో ఫిజిబిలిటి రిపోర్టు తయారు చేస్తున్నామని, అనంతరం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోతామని ఎమ్మెల్యేకు అధికారులు తెలిపారు. భవిష్యత్‌లో ఎయిర్‌పోర్టు ఏర్పాటు వల్ల ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటు ఆదిలాబాద్ జిల్లా ప్రాంత ప్రజలకు, పారిశ్రామిక ప్రాంతాల్లోని అధికారులకు ఎంతగానో ఉపయోగంగా ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎయిర్‌పోర్టు విషయంలో చురుగ్గా ఉందని,పెద్దఎత్తున ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు వివరించారు.

జనవరి 28 నుంచి
సమ్మక్క-సారలమ్మ జాతర
ఉమ్మడి జిల్లాలో 60కి పైగా ప్రదేశాల్లో ఏర్పాట్లు


పెద్దపల్లి జిల్లా గోయల్‌వాడలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

కరీంనగర్ కల్చరల్, జనవరి 4: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జనవరి 28 నుంచి నిర్వహించనున్న సమక్కసారలమ్మ జాతర, అధికారుల వివరాలు, శాఖాపరమైన సూచనలను ఉమ్మడి జిల్లా దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ నాయిని సుప్రియ విడుదల చేశారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 60కి పైగా, అందులో దేవాదాయశాఖ ఆధ్వర్యంలో 31 చోట్ల జాతర కొనసాగనుంది. ఆయా జాతరల నిర్వాహకులు, అధికారులు ఇప్పటికే ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

జాతర అధికారులు వీరే...

- కరీంనగర్ జిల్లాలో..

హుజూరాబాద్, వావిలాలకు కె.సుధాకర్, జూపాక (హుజూరాబాద్)కు కె.సుభద్ర, ఇల్లందకుంట (మల్యాల), తనుగుల (జమ్మికుంట)కు కె.మోహన్, రేకుర్తి (కొత్తపల్లి)కి ఎ.మారుతి, చింతకుంట (కొత్తపల్లి), కొండపల్కల (మానకొండూరు), కొత్తపల్లి (తిమ్మాపూర్)కు ఎస్.అనిల్‌కుమార్, కేశవపట్నం (శంకరపట్నం), సైదాపూర్‌కు డీపీ మారుతీరావు, వీణవంక, కేశవాపూర్ (జమ్మికుంట), చల్లూరు, కోరుకల్ (వీణవంక)కు జి.రాజయ్య.

- జగిత్యాల జిల్లా : ధర్మపురికి డి.కిరణ్

- పెద్దపల్లి జిల్లాలో...

కొలనూరు, మడక (ఓదెల), కొదురుపాక, తొగర్రాయి (సుల్తానాబాద్), మీర్జంపేట, పెగడపల్లి (కాల్వశ్రీరాంపూర్), హన్మంతుని పేట (పెద్దపల్లి)కి బి సదయ్య, నీరుకుళ్ళ, గర్రెపల్లి (సుల్తానాబాద్), ఎలిగేడు, తెలుకుంట్ల (జూలపల్లి)కి ఎం.శంకరయ్య , గోదావరిఖని, ఈసలతక్కళ్ళపల్లి (రామగుండం), గుండారం (కమాన్‌పూర్)కు కె.కాంతారెడ్డి, గోయల్‌వాడ (రామగుండం)కు కె.రాజ్‌కుమార్.

భక్తులకు అసౌకర్యం కలుగకుండా చర్యలు

- నాయిని సుప్రియ, ఉమ్మడి జిల్లా దేవాదాయశాఖ సహాయ కమిషనర్



భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చర్యలు చేపట్టాం. అన్ని శాఖలు, జాతర కమిటీలు, అధికారుల సమన్వయంతో ముందుకు సాగాలి.

ఘనంగా దత్తాత్రేయ స్వామి జయంతి వేడుకలు



అలంకరణకు ముందు వరదవెల్లి దత్తాత్రేయ స్వామి, వ్రతంలో పాల్గొన్న భక్తులు


ధర్మపురిలో దత్తాత్రేయ స్వామి

ధర్మపురి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో దత్తాత్రేయ స్వామి జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. గత నెల 27 నుంచి ఆరంభమైన దత్తాత్రేయ స్వామి నవరాత్రోత్సవాల్లో భాగంగా గురువారం దత్తాత్రేయ స్వామి వారలను అందంగా పూలతో అలంకరణ చేశారు. అనంతరం ఆలయ వేదపండితులు విశేష పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో అనేక మంది భక్తులు స్వామి వారలను దర్శనం చేసుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్ పాల్గొన్నారు. ధర్మపురి గోదావరి నదీ తీరాన గల శ్రీ దత్తాత్రేయ స్వామి ఆలయంలో దత్తాత్రేయ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

వరదవెల్లి దత్తాత్రేయ స్వామి ఆలయంలో..

బోయినపల్లి: మండలంలోని వరదవెల్లి దత్తాత్రేయ స్వామి జయంతి ఉత్సవాలు రెండో రోజు వైభవంగా జరిగాయి. స్వామివారి దర్శనం కోసం గుట్టపైకి వెళ్లేందుకు పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఐదు బోట్లను ఏర్పాటు చేశారు. పౌర్ణమి సందర్భంగా వేలాదిగా భక్తులు తరలి రావడంతో స్వామివారి దర్శనం కోసం భక్తులకు మూడు గంటల సమయం పట్టింది. అనంతరం గుట్ట కింద సామూహిక సత్య దత్త వ్రతాలను నిర్వహించారు. గురుపూజ, హారతి, రాత్రి దత్తాత్రేయస్వామి డోలోత్సవం వైభవంగా నిర్వహించారు. వేములవాడ ఇన్‌చార్జి డీఎస్పీ నాగేంద్రచారి, రూరల్ శ్రీనివాస్, ఎస్సై రమాకాంత్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఎయిర్‌పోర్ట్ స్థలాన్ని పరిశీలించిన అధికారులు


స్థల పరిశీలన చేస్తున్న బానోతు శ్రీనివాస్

పాలకుర్తి/అంతర్గాం డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): అంతర్గాం మండలంలో ప్రతిపాదించిన ఎయిర్‌పోర్టు స్థలాన్ని గురువారం ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు సర్వే చేశారు. కమ్యునికేషన్స్, నావిగేషన్స్, సర్వేలైన్స్ డిప్యూటీ జనరల్ మేనేజర్ బానోతు శ్రీనివాస్, ఇతర అధికారులు హాజరయ్యారు. 977 ఎకరాల స్థలంలో ఏర్పాటుకు మ్యాప్‌ను అధికారులు పరిశీలించారు. అనంతరం గోలివాడ, ముర్మూరు పంపుహౌజ్, ఎల్లంపల్లి ప్రాజెక్ట్, స్పిన్నింగ్ మిల్లు, రామగుండం రైల్వేస్టేషన్‌ను సందర్శించారు. స్థలం అనుకూలంగా ఉందని అధికారులు పేర్కొన్నారు. ఆర్డీవో గంగయ్య, తహసీల్దార్ తూము రవిందర్ పటేల్, సీఐ ప్రవీణ్ కుమార్, ట్రాన్స్‌కో, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

మాజీ సీఎం రోశయ్యకు ఘన నివాళి

కరీంనగర్ అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజెటి రోశయ్య వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటం వద్ద కలెక్టర్ పమేలా సత్పతి, అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే నివాళులు అర్పించారు. డీఆర్వో వెంకటేశ్వర్లు, ఏవో సుధాకర్ పాల్గొన్నారు.

కరీంనగర్ టౌన్: మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో పలు శాఖలకు మంత్రిగా, ముఖ్య మంత్రిగా, గవర్నర్‌గా రోశయ్య ఎనలేని సేవలందించారన్నారు. అదనపు కమిషనర్ సువార్త, డిప్యూటీ కమిషనర్ ఖాదర్ మొహియుద్దీన్, పలువురు అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కరీంనగర్ అర్బన్: మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య వర్ధంతి సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం సుడా చైర్మన్ కోమటి రెడ్డి నరేందర్‌రెడ్డి, నాయకుడు కంకణాల అనిల్ కుమార్ గుప్తా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోశయ్య సేవలను కొని యాడారు. కాంగ్రెస్ నాయకులు శ్రావణనాయక్, అరుణ్ కుమార్, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, సలీమొద్దీన్, అబ్దుల్ రెహమాన్, అనిల్, కోడూరు రవీందర్‌గౌడ్, దన్నా సింగ్, మామిడి సత్య నారాయణరెడ్డి, హసీనా, రాజకుమార్, ముద్దసాని క్రాంతి, సిరిపురం నాగప్రసాద్ పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి



నివాళులు అర్పిస్తున్న సుడా చైర్మన్ నరేందర్‌రెడ్డి

హుజూరాబాద్: పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయంలో కమిషనర్ సమ్మయ్య ఆధ్వర్యంలో వేసి నివాళులర్పించారు. మేనేజర్ భూపాల్‌రెడ్డి, అకౌంటెంట్ గోపాల్, సానిటరీ ఇన్‌స్పెక్టర్ కిరణ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంట: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ మహమ్మద్ అయాజ్ రోశయ్య చిత్ర పటం వద్ద నివాళులు అర్పించారు. మేనేజర్ రాజిరెడ్డి, టీపీవో శ్రీధర్, అకౌంట్ ఆఫీసర్ రాజశేఖర రెడ్డి, ఏఈ వికాస్, టీపీబీవో దీపిక, సీనియర్ అసిస్టెంట్ వాణి, భాస్కర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేష్ పాల్గొన్నారు.

● సంక్షిప్తంగా..

మానకొండూర్: మండలంలోని ముంజంపల్లి శ్రీకృష్ణ పురుషుల పొదుపు సంఘం సభ్యుడు ఎల్లయ్య ఇటీవల మృతి చెందగా సామూహిక బీమా కింద లక్షా పదివేల రూపాయల చెక్కును అతడి భార్య నాగమ్మకు గురువారం అందజేశారు. సంఘం పొరండ్ల అధ్యక్షుడు మాదన వీరయ్య, వోడ్నాల నారాయణపాల్గొన్నారు.

భగత్‌నగర్: ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా గురువారం మల్కాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయులను రాజరాజేశ్వరి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సన్మానించారు. క్లబ్ అధ్యక్షుడు నరహరి లక్ష్మారెడ్డి, రాళ్లబండి శంకర్‌ప్రసాద్‌రెడ్డి, బొంగోని పర్శరాములు పాల్గొన్నారు.

భగత్‌నగర్: భరత్‌రెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో భరత్‌రెడ్డి జయంతి సందర్భంగా మల్కాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. రాళ్లబండి శంకర్‌పరసాద్‌రెడ్డి, బొంగోని పరుశురాములు పాల్గొన్నారు.

కరీంనగర్ టౌన్: బీఆర్‌ఎస్ నాయకుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రెడ్డవేణి మధు కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పరామర్శించారు. గురువారం మధు తల్లి రెడ్డవేణి వజ్రమ్మ అనారోగ్యంతో మృతిచెందారు. మాజీ ఎంపీపీ శ్రీలత మహేశ్ ఉన్నారు.

హుజూరాబాద్: పట్టణంలోని సత్సంగలో ధాన్య గురు చింత అనిల్ కుమార్ ఆధ్వర్యంలో త్రిమూర్తుల ప్రతిరూపంగా భావించే దత్తాత్రేయ స్వామి జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు.

కాంగ్రెస్‌లో చేరిన ఊటూరు బీఆర్‌ఎస్ నాయకులు



ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో నాయకులు

తిమ్మాపూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మానకొండూర్ మండలం ఊటూరుకు చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. గురువారం మండలం లోని మహాత్మానగర్ ఎల్‌ఎండీ క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ బలోపేతం కోసం కలిసికట్టుగా కృషి చేయాలని కోరారు. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో అవినీతి, అక్రమాలతో రాష్ట్ర ఖజానాకు తూట్లు పొడిచారని ఆరోపించారు. అందుకు అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బీఆర్‌ఎస్ పాలనకు చరమగీతం పాడారన్నారు. సర్పంచులుగా కాంగ్రెస్ మద్దతుదారులను గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఊటూరు గ్రామ శాఖ అధ్యక్షుడు బోంగాని సునిల్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

అభ్యర్థులకు అవగాహన సదస్సు

కరీంనగర్ రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల సందర్భంగా కరీంనగర్ రూరల్ మండలంలో పోటీలో నిలిచిన సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులకు గురువారం మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో సంజీవరావు మాట్లాడుతూ అభ్యర్థులు ఖర్చుల వివరాలను ఎప్పటికప్పుడు అప్పజెప్పాలని, ఎన్నికల నియమావళిని పాటించాలని అన్నారు. సీఐ నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ వాహనాలకు అనుమతులు తీసుకోవాలన్నారు.

గంగాధర: స్థానిక సంస్థల ఎన్నికల నిబంధనలు పాటించాలని ఎంపీడీవో రాము తెలిపారు. గురువారం గంగాధర రైతు వేదికలో 33 గ్రామాల సర్పంచ్, వార్డు సభ్యులతో ఎన్నికల నియమావళిపై అవగాహన సదస్సు నిర్వహించారు. రోడ్‌షోలు, లౌడ్ స్పీకర్ల వినియోగంపై గడువు దాటితే చర్యలు తప్పవన్నారు.తహసీల్దార్ రజిత, ఎస్సై వంశీకృష్ణ పాల్గొన్నారు.

ఫిజీషియన్ల సంఘం జిల్లా కార్యవర్గం



డాక్టర్ సంజయ్ కల్బందె



డాక్టర్ చైతన్యరెడ్డి



డాక్టర్ అనీష్‌రెడ్డి

సుభాష్‌నగర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఫిజీషియన్ల సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డాక్టర్ సంజయ్ కల్బందె, ప్రధానకార్యదర్శిగా డాక్టర్ పి.చైతన్య రెడ్డి, కోశాధికారిగా డాక్టర్ అనీష్‌రెడ్డి, ఎలెక్ట్ చైర్మన్‌గా డాక్టర్ ఆర్. వెంకటేశ్వర్లు, సీనియర్ వైస్ చైర్మన్‌గా కె.సునీల్‌కుమార్‌రెడ్డి, వైస్ చైర్మన్లుగా డాక్టర్ కృష్ణప్రసాద్, డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ శ్రీధర్ చాట్ల, డాక్టర్ జాన సురేష్, డాక్టర్ ఆర్. తిరు నాదర్, డాక్టర్ జి.వెంకట్‌రెడ్డి, సహాయకార్యదర్శులుగా డాక్టర్ నవీన, డాక్టర్ పద్మ, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ రామ్మోహన్, డాక్టర్ అంకిత్‌సక్సేన ఎన్నికయ్యారు. గురువారం స్థానిక శ్వేత హోటల్‌లో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు డాక్టర్ విజయ్‌మోహన్‌రెడ్డి, సీనియర్ ఫిజీషియన్లు డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ వీరారెడ్డి, డాక్టర్ రఘురామన్, డాక్టర్ డీసీ తిరుపతిరావు, డాక్టర్ లక్ష్మణ్ వడ్డిబోయిన తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు ఆవాల సరోజన మృతి



సరోజన(ఫైల్)

కరీంనగర్ అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు ఆవాల సరోజన (70) బుధవారం రాత్రి కరీంనగర్ లోని ఆమె నివాసంలో కన్ను మూశారు. జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా, కరీంనగర్‌లోని అంజని మహిళా సూపర్ మార్కెట్ అధ్యక్షురాలిగా పనిచేశారు. కొంత కాలంగా ఇంటికి పరిమితమైన ఆమె అనారోగ్యంతో బాధపడ్డారు.

● ఆవాల సరోజన మృతి బాధాకరమని మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. ఆమె మరణం పార్టీకి తీరని లోటుగా పేర్కొన్నారు.

మాజీ కార్పొరేటర్ మెండి శ్రీలత చంద్రశేఖర్(మార్షల్) తండ్రి మెండి శంకరయ్య మృతిపై మంత్రి సంతాపం తెలిపారు.

● ఆవాల సరోజనకు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి నివాళులర్పించారు.

● కరీంనగర్ కార్పొరేషన్ అధ్యక్షుడు వైద్యుల అంజన్‌కుమార్ సంతాపం తెలిపారు. సరోజన పార్థివ దేహంపై కాంగ్రెస్ జెండా కప్పి నివాళులు అర్పించారు. పార్టీకి చేసిన సేవలను కొనియాడారు.

కరాటే విజేతలకు సీపీ అభినందన

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కరాటే విజేతలను సీపీ గౌస్ ఆలం గురువారం అభినందించారు. విశాఖపట్నంలో గత నెల 27 నుంచి 30 వరకు ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో 28వ జాతీయ స్థాయి కరాటే పోటీలు నిర్వహించారు. కరీంనగర్ ఒకినావా స్కూల్ క్రీడాకారులు 16 పతకాలు సాధించినట్లు చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ వసంత్ కుమార్ తెలిపారు.

రోడ్ సేఫ్టీపై అవగాహన

తిమ్మాపూర్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామకృష్ణ కాలనీలో ఎల్‌ఎండీ పోలీసులు రోడ్ సేఫ్టీపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్‌ఎండీ ఎస్సై శ్రీకాంత్ మాట్లాడుతూ వాహనాలు అతివేగంగా నడపడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వాహనాన్ని జాగ్రత్తగా నడిపి గమ్యాన్ని చేరేవిధంగా ఉండాలన్నారు. అనంతరం కర పత్రాలను అందజేశారు.

క్రమశిక్షణకు చుక్కాని ఎన్‌సీసీ

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణకు చుక్కాని ఎన్‌సీసీ అని కమాండింగ్ అధికారి లెఫ్టినెంట్ కల్నల్ జయంత అన్నారు. 9వ తెలంగాణ బెటాలియన్ ఎన్‌సీసీ కరీంనగర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వార్షిక శిక్షణ శిబిరం గురువారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిబిరంలో నేర్చుకున్న అం శాలతో ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన ఎన్‌సీసీ కేడెట్లకు బహుమతులు ప్రదానం చేశారు. లెఫ్టినెంట్ కల్నల్ కృష్ణ, సుబేదార్ మేజర్ సాగర్‌సింగ్, సూర్యప్రసాద్, ఏఎస్‌వోలు, జీసీఐలు పాల్గొన్నారు.

లిఖిత్ చైతన్యకు అంతర్జాతీయ ఫిడే రేటింగ్

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని విశ్వనాథ్ చెస్ అకాడమీకి చెందిన విద్యార్థి ఈగ లిఖిత్ చైతన్య 1503 అంతర్జాతీయ ఫిడే రేటింగ్ సాధించాడు. గత నెల చివరివారంలో విజయవాడలో నిర్వహించిన బిలో 1800 అంతర్జాతీయ రేటింగ్ చెస్ టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరిచినట్లు అకాడమీ డైరెక్టర్, చీఫ్ కోచ్ విశ్వనాథ్ ప్రసాద్ తెలిపారు. లిఖిత్ చైతన్య ప్రస్తుతం సాయిమానేరు పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు.

గ్రంథాలయాన్ని సందర్శించిన విద్యార్థులు

కరీంనగర్ కల్చరల్, జనవరి 4: క్షేత్ర పర్యటనలో భాగంగా జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని మంగళ, బుధవారాల్లో పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు సందర్శించారు. చిల్డ్రన్ లైబ్రరీతోపాటు ప్రధాన గ్రంథాలయంలో పుస్తకాలు, సేవలపై తెలుసుకున్నారు. గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సరిత తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్‌వాసులకు హరిదా పురస్కారాల ప్రదానం

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌కు చెందిన కవులు అన్నవరం దేవేందర్, సబ్బని లక్ష్మీనారాయణ, రచయిత్రి సుజనాదేవికి గురువారం నిజామాబాద్‌లోని నవ్యభారతి గ్లోబల్ స్కూల్‌లో జరిగిన సరస్వతీరాజ్ సాహిత్యోత్సవంలో హరిదా సరస్వతీ రాజ్ కవితా పురస్కారాలను అందజేశారు. సినీ గేయ రచయిత వరికుప్పల యాదగిరి, ఘనపురం దేవేందర్, సంగిశెట్టి శ్రీనివాస్, డాక్టర్ చమన్, డాక్టర్ కాలువ మల్లయ్య, క్యాతం సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన సర్పంచ్ స్వతంత్ర అభ్యర్థి

కరీంనగర్ రూరల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం బహదూర్ ఖాన్ పేట స్వతంత్ర అభ్యర్థి గుర్రం సంధ్య తిరుపతిరెడ్డి గురువారం కాంగ్రెస్‌లో చేరారు. పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ కండువా కప్పి ఆహ్వానించారు.

భగత్‌నగర్: బద్దిపల్లి స్వతంత్ర సర్పంచ్ అభ్యర్థి తాండ్ర రాజశేఖర్ వెలిచాల రాజేందర్‌రావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

ఎన్నీల ముచ్చట్లు

కరీంనగర్ కల్చరల్, జనవరి 4: నగరంలోని సూర్య రెసిడెన్సీలో గురువారం దామరకుంట శంకరయ్య ఆతిథ్యంలో 52వ ఎన్నీల ముచ్చట్లు నిర్వహించారు. తెరవే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బూర్ల వెంకటేశ్వర్లు, సంస్థ రాష్ట్ర పూర్వా.ధ్యక్షుడు గాజోజు నాగభూషణం, జిల్లా అధ్యక్షుడు సీవీ కుమార్, రాము, రామయ్య, కూకట్ల తిరుపతి, విలాసాగరం రవీందర్, బసవేశ్వర్, నిర్మలారాణి, అఖిల్‌కుమార్, ఖాలిద్, అంజయ్య పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న గంగాడి కృష్ణారెడ్డి

వీణవంక, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఘన్ముక్లలో కాంగ్రెస్ నుంచి పలువురు నాయకులు బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో గురువారం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన కండువాలు కప్పి ఆహ్వానించారు. నాయకులు గాజుల సంపత్, పాకాల రవీందర్ రెడ్డి, గాజుల అశోక్, చంద్రయ్య, విజయ్, కోమాల్ రెడ్డి బీజేపీలో చేరారు. మండల అధ్యక్షుడు బత్తిని నరేష్ గౌడ్, నాయకులు బత్తిని నరేష్ గౌడ్, రామిడి ఆదిరెడ్డి, సదానందం, హరీష్, రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తున్న సీఎం

కరీంనగర్ టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుగుతుండగా సీఎం రేవంత్‌రెడ్డి అర్బన్, పట్టణ ప్రాంతాల్లో ప్రజాపాలన విజయోత్సవాల సభలు నిర్వహించడం ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించడమేనని మాజీ ఎమ్మెల్యే బీఆర్‌ఎస్ నాయకుడు సుంకె రవిశంకర్ ఆరోపించారు. గురువారం నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విజయోత్సవ సభలు కావని, పూర్తిగా ఎన్నికల ప్రచార సభలను తలిపిస్తున్నాయని అన్నారు. వెంటనే నిలిపివేసేలా ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.సమావేశంలో సింగిల్ విండో చైర్మన్ తిరుమల్‌రావు, గట్టుభూత్కూర్ మాజీ సర్పంచ్ కర్ర విజయేందర్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి, నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికలు లేక నిలిచిన నిధులు

భగత్‌నగర్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికలు నిర్వహించక పోవడంతో కేంద్రం నుంచి రావాల్సిన నిధులు నిలిచి పోయాయని సీపీఐ సీనియర్ జాతీయ నాయకుడు మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో జిల్లా కార్యవర్గ కౌన్సిల్ సభ్యుల సమావేశంలో మాట్లాడారు. పంచాయతీ ఎన్నికల్లో నిత్యం ప్రజా క్షేత్రంలో ఉండి సీపీఐ బలపరిచే అభ్యర్థులనే గెలిపించు కోవాలన్నారు. కార్మిక వర్గానికి, కర్షకులకు అండగా నిలబడి పోరాటాలు చేసేది కమ్యూనిస్టు పార్టీ మాత్రమే అన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, పొనగంటి కేదారి, అందె స్వామి, కసిరెడ్డి సురేందర్‌రెడ్డి నాగెల్లి లక్ష్మారెడ్డి, బోయిని అశోక్, గూడెం లక్ష్మి, పిట్టల సమ్మయ్య జిల్లా కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ గడ్డం రాంరెడ్డికి ఘన నివాళి

భగత్‌నగర్/గణేశ్‌నగర్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆచార్య గడ్డం రాంరెడ్డి 96వ జయంతిని నగరంలో ఘనంగా నిర్వహించారు. గురువారం ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల వద్ద ప్రొఫెసర్ రాంరెడ్డి విగ్రహానికి సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, మాజీ శాసన సభ్యుడు ఉచ్చిడి మోహన్‌రెడ్డి, ఆర్‌బీవీఆర్‌ఆర్ ప్రధాన కార్యదర్శి బండ గోపాల్‌రెడ్డి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సురేందర్‌రెడ్డి, సత్యప్రకాశ్, వైస్ ప్రిన్సిపాల్ రాజయ్య, డాక్టర్ శ్రీనివాస్, రెడ్డి సంఘం నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న నరేందర్‌రెడ్డి, నాయకులు

వసతి గృహంలో ఆరోగ్య శిబిరం

గణేశ్‌నగర్,డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వ విద్యాలయ ప్రాంగణంలోని అన్యోన్య వసతి గృహంలో రెనే హాస్పిటల్, రజిని ఫెర్టిలిటీ సెంటర్ సౌజన్యంతో వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ ఉమేష్ కుమార్ మెగా ఆరోగ్య శిబిరాన్ని ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటే చదువుపై శ్రద్ధ పెట్టగలరని, తద్వారా మంచి మార్కులు, ఉన్నత ఉద్యోగాలు సంపాదించుకోవచ్చని అన్నారు. ప్రస్తుత కాలంలో ఆరోగ్యమే మహాభాగ్యమనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలన్నారు. సమతుల్యమైన ఆహారం తీసుకోకపోవడంతో ఆరోగ్యం దెబ్బతిని వ్యాధుల బారిన పడే అవకాశం ఉందన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య జాస్తి రవికుమార్ వసతి గృహంలో చికిత్స గదిని ప్రారంభించారు. గైనకాలజిస్ట్ డాక్టర్ రజనీ ప్రియదర్శిని మాట్లాడుతూ విద్యార్థినులు మూడు నెలలకు ఒకసారి తమ ఆరోగ్యాన్ని చెక్ చేసుకోవాలని, ఆహారంలో పండ్లకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. రెనే హాస్పిటల్‌జనరల్ ఫిజీషియన్ సుస్మిత, పవన్ ప్రసాద్, సోనాలిక, శ్రీవాణి, విశ్వవిద్యాలయం ఓఎస్డీ టు వీసీ హరికాంత్, డాక్టర్ సరసిజ, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ రమాకాంత్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ సూరేపల్లి సుజాత పాల్గొన్నారు.

నామినేషన్ కేంద్రాల పరిశీలన



అధికారులతో మాట్లాడుతున్న అబ్జర్వర్ వెంకటేశ్వర్లు

ఇల్లందకుంట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట మండలంలోని ఐదు నామినేషన్ క్లస్టర్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అబ్జర్వర్ వెంకటేశ్వర్లు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లస్టర్‌లో నామినేషన్ వేసే దగ్గర హెల్ప్‌లైన్‌లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. నామినేషన్ పత్రాలు వేసే సమయంలో సరిగా చూసుకొని సమర్పించాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ రాజమల్లు, ఎంపీడీవో రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సైదాపూర్: సైదాపూర్ మండలంలోని సైదాపూర్, వెన్కేపల్లి గ్రామాలలోని నామినేషన్ కేంద్రాలను గురువారం గ్రామ పంచాయతీ ఎన్నికల పరిశీలకులు వెంకటేశ్వర్లు సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. నామినేషన్ కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు అల్ఫోర్స్ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న నరేందర్‌రెడ్డి

భగత్‌నగర్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు కొత్తపల్లి అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాల విద్యా ర్థులు ఎంపికయ్యారు. గురువారం పాఠశాల ఆవరణలో అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి విద్యార్థులను అభినందించారు. పాఠశాలకు చెందిన బి.సిద్ధార్థ, ముక్తహసిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవడం అభినందనీయమన్నారు.

తొలి విడత ప్రచార జోరు

కరీంనగర్ రూరల్, డిసెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): తొలివిడత గ్రామ పంచాయతీ ఎన్నికల ఉపసంహరణ బుధవారం ముగియడంతో ప్రచార జోరు మొదలైంది. కరీంనగర్ రూరల్ మండలంలో 14 గ్రామాల్లో 57 మంది సర్పంచ్ అభ్యర్థులు, 132 వార్డులకు 32 వార్డులు ఏకగ్రీవమవగా మిగతా 100 వార్డులకు 246 మంది పోటీలో ఉన్నారు. ఉపసంహరణ అనంతరం గ్రామాల్లో రాత్రికి రాత్రే గోడలపై, ఇళ్ల తలుపులపై వార్డు సభ్యుల, సర్పంచ్ పోటీదారుల ఫొటోలు దర్శనమిచ్చాయి. కొందరు వారికి వచ్చిన గుర్తులను సైతం కొనుగోలు చేసి ప్రచారం చేస్తున్నారు. మొదటి రోజు అభ్యర్థులు ఇంటింటికి తిరుగుతూ ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నించారు. మరి కొందరు నగరాల్లో ఉన్న అభ్యర్థులను కలిసి ఓటు అభ్యర్థిస్తున్నారు.

మ్యూజియంను సందర్శించిన విద్యార్థులు

గణేశ్‌నగర్, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): కోతిరాంపూర్‌లోని అచీవర్స్ పాఠశాలకు చెందిన మూడో తరగతి విద్యార్థులు గురువారం నగరంలోని మ్యూజియంను సందర్శించారు. అనంతరం ప్రిన్సిపాల్ సీహెచ్ పల్లవి మాట్లాడుతూ దేశ చరిత్ర, సంస్కృతిపై తెలియజేసేందుకు కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. డైరెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పార్కింగ్ స్థలాన్ని కేటాయించాలి

కరీంనగర్ టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జిల్లా పోలీసు హెడ్‌క్వార్టర్స్‌కు చెందిన దుకాణాల సముదాయం (షెట్టర్స్) ఎదుట పార్కింగ్ స్థలం కేటాయించాలని మాజీ కార్పొరేటర్ కంసాల శ్రీనివాస్ ఒక ప్రకటనలో కోరారు. ఆయా దుకాణాలు, హోటల్‌కు వచ్చే వారు రోడ్డుపైనే వాహనాలను పార్కింగ్ చేయాల్సి వస్తోందని, ట్రాఫిక్ పోలీసులు జరిమానా విధిస్తున్నారని పేర్కొన్నారు.

మున్సిపల్‌లో ఉద్యోగులకు టౌన్‌ప్లానింగ్ బాధ్యతలు

కరీంనగర్ టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థలోని టౌన్‌ప్లానింగ్ విభాగంలో సేవలు మరింత వేగంగా నిర్వహించేందుకు కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఇతర విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు టౌన్‌ప్లానింగ్ విధులు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రెవెన్యూ విభాగంలో సపోర్టింగ్ స్టాఫ్‌గా పనిచేస్తున్న పి.విజయ్ (నాన్ పీహెచ్ వర్కర్), స్నేహేష్‌రాజ్ (నాన్ పీహెచ్‌వర్కర్), సానిటేషన్ విభాగంలో జవాన్లుగా పనిచేస్తున్న పీహెచ్ వర్కర్లు ఆరెపల్లి అన్వేష్, బోతు రాంచంద్రం, వి.అరుణ్, జిల్లల్ల మల్లేశం, రామగిరి ఆనంద్‌కుమార్, ఇన్‌చార్జి వార్డు ఆఫీసర్ కె.జీత్‌కుమార్‌కు చైన్‌మన్ బాధ్యతలను అప్పగించారు.

విద్యార్థుల క్షేత్ర సందర్శన

భగత్‌నగర్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రేకుర్తిలోని విజన్ హైస్కూల్ విద్యార్థులు గురువారం క్షేత్ర సందర్శనలో భాగంగా జిల్లా గ్రంథాలయం, అగ్నిమాపక కేంద్రాన్ని సందర్శించారు. పాఠశాల కరస్పాండెంట్ సిరిపురం ప్రసాద్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లీగల్‌సెల్ ఆధ్వర్యంలో అంజన్‌కుమార్‌కు సన్మానం

కరీంనగర్ అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ లీగల్ సెల్ అడ్వకేట్స్ ఆధ్వర్యంలో ఇటీవల నియామకమైన పార్టీ కరీంనగర్ కార్పొరేషన్ అధ్యక్షుడు వైద్యుల అంజన్‌కుమార్‌ను గురువారం సన్మానించారు. లీగల్‌సెల్ చైర్మన్ లక్ష్మయ్య, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, అడ్వకేట్స్ లక్ష్మారెడ్డి, రాచకొండ ప్రభాకర్, బాలకిషన్, చక్రధర్ పాల్గొన్నారు.

ఘంటసాల 103వ జయంతి

కరీంనగర్ కల్చరల్, జనవరి 4: నగరంలోని వావిలాలపల్లిలోని స్వరమాధురి కల్చరల్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం ఆ సంస్థ అధ్యక్షుడు వంగ వేంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఘంటసాల 103వ జయంతి నిర్వహించారు.

సుబ్రహ్మణ్య స్వామికి ఫలపంచామృతాభిషేకం

కరీంనగర్ రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కృతికా నక్షత్రం సందర్భంగా గురువారం నగునూర్ పరివార సమేత దుర్గాభవానీ ఆలయంలో శ్రీవల్లి దేవసేనన సహిత సుబ్రహ్మణ్య స్వామివారలకు ఫలపంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు.

నగర కాంగ్రెస్ నాయకులతో అత్యవసర సమావేశం

కరీంనగర్ అర్బన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కాంగ్రెస్ నాయకులతో పార్టీకార్పొరేషన్ అధ్యక్షుడు వైద్యుల అంజన్‌కుమార్ గురువారం డీసీసీ కార్యాలయంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు స్వాగత ఏర్పాట్లు, ఇతర అంశాలపై చర్చించారు.

మాజీ మంత్రి గంగుల పరామర్శ

భగత్‌నగర్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మాజీ మార్కెట్ చైర్మన్ రెడ్డవేణి మధు మాతృమూర్తి వజ్రమ్మ మరణించగా మాజీ మంత్రి, శాసన సభ్యుడు గంగుల కమలాకర్ పరామర్శించారు. గురువారం బావుపేటలోని వారి స్వగృహానికి వెళ్లి వజ్రమ్మ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పిల్లి శ్రీలతమహేష్, నాయకులు కమలమనోహర్ తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు అలయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సన్మానం

సుభాష్‌నగర్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): అఖిల భారత సివిల్ సర్వీసెస్ నాటికల పోటీల్లో విద్యా, వైద్యంపై అవగాహన అనే నాటికను ప్రదర్శించి జాతీయస్థాయిలో ఎంపికైన కళాకారులను అలయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సన్మానించారు. గురువారం క్లబ్ ఇంటర్నేషన్ డైరెక్టర్ డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో రచయిత, ప్రభుత్వ వైద్య కళాశాల అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ ఆగస్టీన్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వసంత, హెల్త్ ఎడ్యుకేటర్ రేష్మ, ఆఫీస్ సూపరింటెండెంట్ రుక్సానబేగం, హెల్త్ సూపర్‌వైజర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో కోల అన్నారెడ్డి, జిల్లా గవర్నర్ చెరిమల వెంకటేశ్వర్లు, కుమారస్వామి, నాగేశ్వర్ పాల్గొన్నారు.

తెలంగాణ గోశాల సంపర్క్ ప్రముఖ్‌గా రాధాకృష్ణారెడ్డి

కరీంనగర్ కల్చరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో బుధవారం నిర్వహించిన వీహెచ్‌పీ రాష్ట్ర స్థాయి సమావేశంలో తెలంగాణ గోశాల సంపర్క్ ప్రముఖ్‌గా కరీంనగర్‌కు చెందిన ఊట్కూరి రాధాకృష్ణారెడ్డి నియమించారు. పలువురు ఉమ్మడి జిల్లాకు చెందిన గోరక్షా సేవకులు, వీహెచ్‌పీ, భజరంగదళ్ నాయకులు అభినందనలు తెలిపారు.

ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలి

కరీంనగర్ టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను వర్క్ అడ్జస్ట్‌మెంట్ పేరుతో పంచాయతీ రాజ్ పాఠశాలలకు పంపించే ఉత్తర్వులను డీఈవో వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం (జీటీఏ) డిమాండ్ చేసింది. పట్టణ ప్రాంతాల ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని జీటీఏ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి గాజుల రవీందర్, మోతె చంద్రశేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో కోరారు.

కార్మికులకు రూ.30 లక్షల బీమా అభినందనీయం

కరీంనగర్ టౌన్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థలోని పలు విభాగాల్లో ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న కార్మికులు, సిబ్బందికి 30 లక్షల రూపాయల ప్రమాద బీమా వర్తింపజేసేందుకు మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ చొరవ తీసుకోవడం అభినందనీయమని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ హర్షం వ్యక్తం చేసింది. గురువారం కమిషనర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

వెటర్నేరియన్స్ అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక

సుభాష్‌నగర్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): తెలంగాణ నాన్ గెజిటెడ్ వెటర్నేరియన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులను ఎన్నుకున్నారు. గురువారం నిర్వహించిన సమావేశంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ననువాల గిరిధర్‌రావు, కార్యదర్శిగా జడ కమలాకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.